# తీన్మార్

నేటి వాస్తవాలు ...

తెలుగు దిన పత్రిక



తీన్మార్ మెల్కోల్పు
చట్టం & న్యాయం లప్పే.....
తీన్మార్ తెలుగు దిన పత్రిక
తలపెట్టిన మెల్కోల్పు కార్యక్రమంలో
భాగస్వామ్యులు కావాలని అనుకునే వారు
రచనలు, కవితలు & వ్యాసాలు
-: ఈ క్రింది మెయిల్ కి పంపించగలరు :-
teenmaardesk@gmail.com



ములుగు | సంపుటి: 04 | సంచిక: 263 | పేజీలు : 8 | మంగళవారం 31 మార్చి 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad


## 21 రాష్ట్రాల్లో తిరిగి
# కిరోసిన్ పంపిణీ



- రేషన్ షాపుల్లో పెట్రోల్ బంకుల్లోనూ విక్రయాలు
- ఇంధన భద్రత కోసం ముందస్తు చర్యలు
- ఈ మేరకు కేంద్రం కీలక నిర్ణయం

**న్యూ ఢిల్లీ, మార్చి 30 (తీన్మార్ న్యూస్):**
అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన సరఫరాలో తలెత్తుతున్న ఆటంకాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 'సుపీరియర్ కిరోసిన్ ఆయిల్' పంపిణీ చేసేందుకు అనుమతినిస్తూ - మిగతా 2లో

## ఆడిటింగ్‌లో
# తీవ్ర నిర్లక్ష్యం

### నష్టాల ఊబిలో ప్రభుత్వ రంగ సంస్థలు



- 50,930 కోట్ల నష్టాల్లో సంస్థలు
- కాగ్ నివేదికలో విస్తుపోయే నిజాలు
- 83 సంస్థల్లో 49 చోట్ల లెక్కలు గల్లంతు




**హైదరాబాద్, మార్చి 30 (తీన్మార్ న్యూస్):**
తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థల తీరుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ విస్తుపోయే నిజాలను బయటపెట్టింది. 2023 మార్చి వరకు ఉన్న గణాంకాలను విశ్లేషించిన కాగ్. రాష్ట్రంలోని మెజారిటీ సంస్థలు నష్టాల ఊబిలో కూరుకుపోయాయని, కనీసం లెక్కలు సమర్పించడంలోనూ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని స్పష్టం చేసింది. రాష్ట్రంలో మొత్తం 83 ప్రభుత్వ రంగ సంస్థలు ఉండగా, వాటిలో 16 సంస్థలు ఇప్పటికే మూతపడటం లేదా లిక్విడేషన్ ప్రక్రియలో ఉన్నాయి. మిగిలిన 67 సంస్థల్లో ఏకంగా 49 సంస్థలు తమ వార్షిక ఖాతాలను సమర్పించడంలో జాప్యం చేశాయి. కేవలం - మిగతా 2లో

## మావోయిస్టులకు
# డీజీపీ పిలుపు



- గణపతి ఆరోగ్యం క్షీణత
- మెరుగైన వైద్యం అందిస్తామని భరోసా
- ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి రావాలి
- ముగియనున్న కేంద్ర ప్రభుత్వ డెడ్‌లైన్

**హైదరాబాద్, మార్చి 30 (తీన్మార్ న్యూస్):**
అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు హింసా మార్గాన్ని విడనాడి, జనజీవన స్రవంతిలో కలిసి గౌరవప్రదమైన జీవితం కొనసాగించాలని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి - మిగతా 2లో




## హేట్ స్పీచ్‌పై
## సర్కార్ ఉక్కుపాదం

- విద్వేష ప్రసంగాలకు చెక్
- సెలెక్ట్ కమిటీకి సిఫార్సు
- అసెంబ్లీలో కీలక బిల్లు

## రాజకీయ ప్రేరేపిత కేసులు
# కొట్టివేయాలని పిటిషన్

### హైకోర్టును ఆశ్రయించిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు




- ప్రభుత్వానికి, పోలీసులకు హైకోర్టు నోటీసులు
- ఏప్రిల్ 9కి విచారణ వాయిదా
- తదుపరి నిర్ణయంపై ఉత్కంఠ

**హైదరాబాద్, మార్చి 30 (తీన్మార్ న్యూస్):**
తెలంగాణ రాష్ట్ర సాధన పోరులో అత్యంత కీలకమైన మిలియన్ మార్చి సందర్భంగా తమపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేయాలని కోరుతూ మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, 2011లో ట్యాంక్‌బండ్‌పై జరిగిన మిలియన్ మార్చి సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు పాల్గొన్న తమపై రాజకీయ ప్రేరేపిత కేసులు నమోదయ్యా యని, వాటిని వెంటనే కొట్టివేయాలని - మిగతా 2లో



## యుద్ధం ఆపేలా
## కేంద్రం చొరవ చూపాలి

### తెలంగాణ అసెంబ్లీ తీర్మానం
### ప్రపంచ శాంతి కోసం డిప్యూటీ సీఎం భట్టి ప్రతిపాదన

**హైదరాబాద్, మార్చి 30 (తీన్మార్ న్యూస్):**
అమెరికా, ఇజ్రాయెల్ – ఇరాన్ యుద్ధాన్ని ఆపేలా కేంద్రం చొరవ చూపాలని తెలంగాణ శాసన సభ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో ప్రవేశపెట్టారు. మధ్యప్రాచ్యంలో యుద్ధం వల్ల దాదాపు 4 వేల మంది మరణించారని ఉపముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ ప్రభావం ఆసియా దేశాలపై తీవ్రంగా పడుతోందని ఆర్థిక విధ్వంసం జరుగుతోందని తెలిపారు. యుద్ధ ప్రభావం భారత్‌పై ఎక్కువగా - మిగతా 2లో

## రెండు దశల్లో
# దేశవ్యాప్త గణన




- 2027 జనగణనలో కీలక మార్పులు
- సహజీవన జంటలకు వివాహిత హోదా
- ఈ మేరకు విధివిధానాలు ఖరారు

**న్యూ ఢిల్లీ, మార్చి 30 (తీన్మార్ న్యూస్):**
దేశవ్యాప్తంగా త్వరలో ప్రారంభం కానున్న 2027 జనగణనలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా సహజీవనం చేస్తున్న జంటలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టతనిచ్చింది. తమ బంధం స్థిరమైనది అని భావించే సహజీవన జంటలను కూడా వివాహిత జంటగానే లెక్కించనున్నారు. సెన్సస్ వెబ్‌సైట్‌లోని ఎఫ్‌ఏక్యూ విభాగంలో ఈ అంశాన్ని పొందుపరిచారు. ఈ మేరకు జనగణన ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది.

రెండు దశల్లో జనగణన

2027 జనగణనను మొత్తం రెండు దశల్లో నిర్వహించనున్నారు. ఈ దశలో హౌస్ లిస్టింగ్ (ఇళ్ల జాబితా), గృహ గణన - మిగతా 2లో

## గిగ్ వర్కర్స్
# బిల్లుకు ఆమోదం

- లక్షలాది మంది కార్మికులకు భరోసా
- రాహుల్ గాంధీ స్ఫూర్తితో చట్టబద్ధత
- మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, మార్చి 30 (తీన్మార్ న్యూస్):**
గిగ్ వర్కర్స్ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది. శాసనసభలో గిగ్ వర్కర్స్ బిల్లుపై చర్చలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. శాసనసభలో మంత్రి వివేక్ వెంకస్వామి గిగ్ వర్కర్స్ బిల్లును తేవడం సంతోషంగా ఉంది. మా నాయకుడు రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్రలో గిగ్ ౖర్స్ తో సమావేశం నిర్వహించారు. లక్షల మంది గిగ్ వర్కర్లు ఈ బిల్లు కోసం ఎదురు చూస్తున్నారు. ఈ బిల్లులో వృత్తిపరంగా - మిగతా 2లో

## అసెంబ్లీలో సన్నబియ్యం విందు

- పేదల బియ్యం రుచి చూసిన సీఎం రేవంత్
- ఏడాది పూర్తి చేసుకున్న సన్నబియ్యం పథకం
- ముఖ్యమంత్రితో కలిసి విందు ఆరగించిన ఎమ్మెల్యేలు



# జీవో 317 బాధితులకు న్యాయం చేయండి

**సీఎం రేవంత్ రెడ్డికి కవిత లేఖ**
**ఎన్నికల హామీని గుర్తు చేసిన జాగృతి అధ్యక్షురాలు**
**స్థానికత నిబంధనల్లో మార్పులకు డిమాండ్**



హైదరాబాద్, మార్చి 30 (తీన్మార్ న్యూస్):

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖ రాశారు. 2021 డిసెంబర్ 6న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.317 ద్వారా వేలాది మంది ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఆ జీవోను రద్దు చేసి ఉద్యోగులకు వారి సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని కోరుతూ పీసీసీ అధ్యక్షుడి హోదాలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి మీరు లేఖ రాసిన విషయం గుర్తు ఉండి ఉంటుందని భావిస్తున్నాం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే జీవో నం.317ను సమీక్షించి బాధిత ఉద్యోగులకు న్యాయం చేస్తామని మీరు హామీ ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలోనూ ఈ హామీని నొక్కి చెప్పారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో మీరు, ప్రస్తుత మీ మంత్రివర్గంలో ఉన్న పలువురు నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను మానసిక క్షోభకు గురి చేస్తున్న జీవో నం.317 బాధితులకు న్యాయం చేస్తామని పలు సందర్భాల్లో హామీ ఇచ్చారు. వెంటనే జీవో నం.317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు వన్ టైం రిలీఫ్ కింద వారి స్థానికత ఆధారంగా వారి స్వస్థలాలకు బదిలీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నాం. అలాగే స్థానికతను గుర్తించే నిబంధనల్లోనూ సమూల మార్పులు చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని లేఖలో కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

# ప్రభుత్వ పెద్దలే గద్దలు

**గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు**
**రాఘవ కన్‌స్ట్రక్షన్‌పై కేటీఆర్ ధ్వజమెత్తు**
**మంత్రి పొంగులేటి బర్తరఫ్‌కు డిమాండ్**



హైదరాబాద్, మార్చి 30 (తీన్మార్ న్యూస్):

హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో గవర్నర్‌తో బీఆర్ఎస్ శాసనసభ పక్షం భేటీ అయింది. ఈ సందర్భంగా రాఘవ కన్‌స్ట్రక్షన్‌పై ఫిర్యాదు చేసింది. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పరిపాలనపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజా సంపదను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. నిబంధనలు తుంగలో తొక్కి అక్రమ మైనింగ్ చేస్తున్నారని అన్నారు. ఎటువంటి పర్మిషన్ లేకుండా వందల కోట్ల ప్రజా సంపద కొల్లగొడుతున్నారని వివరాలతో గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఇదే విషయమై మా నాయకుడు హరీష్ రావు అసెంబ్లీలో లేవనెత్తితే ఎదురుదాడి చేశారు. అక్రమ మైనింగ్‌పై సీబీ సీఐడి విచారణ చేయిస్తాం అని సీఎం అంటున్నారు మేము హౌస్ కమిటీ వెయ్యాలని డిమాండ్ చేశాము. హౌస్ కమిటీలకు విలువ లేదని మంత్రి శ్రీధర్ బాబు అనడం విడ్డూరం. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ హౌస్ కమిటీకి అనేక సార్లు డిమాండ్ చేశారు. ఇక్కడేమో హౌస్ కమిటీలకు విలువ లేదని ప్రభుత్వం అనడం ఎంత వరకు సబబుని కేటీఆర్ ప్రశ్నించారు. సీబీ సీఐడి రాష్ట్ర ప్రభుత్వంలో ఒక విభాగం, మంత్రిపై విచారణ నిష్పక్షపాతంగా జరగదు. మంత్రివర్గం నుంచి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశాము. ఇదే విషయమై ఈరోజు మండలిలో మా ఎమ్మెల్సీలు నిలదీస్తే వారిని సస్పెండ్ చేశారు. ప్రభుత్వ పెద్దలే గద్దలుగా మారితే, రక్షకులే భక్షకులు అయితే ఎలా ప్రజలకు ఎవరు దిక్కు. హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలని గవర్నర్‌కు చెప్పాం. ఎమర్జెన్సీ ఇందిరమ్మ పాలన తెలంగాణలో కనిపిస్తుంది. ప్రజా సంపద దోపిడీ అడ్డుకోవాలని గవర్నర్‌కు వివరించాం అని కేటీఆర్ వెల్లడించారు.

# కేసీఆర్ ఉంటేనే నా పనులకు గుర్తింపు

**సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు**
**రావణుడి వల్లే రాముడి గొప్పతనం**
**ప్రతిపక్ష నేతపై సెటైర్లు**



హైదరాబాద్, మార్చి 30 (తీన్మార్ న్యూస్):

ప్రధాన ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఆయన మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ కేసీఆర్ లేకపోతే తాను చేసిన మంచి పనులు జనానికి తెలిసేవి కావని అన్నారు. రావణుడి చెడు వల్లే రాముడి గొప్పతనం తెలిసిందంటూ సెటైర్లు వేశారు. కేసీఆర్ ఉండటం వల్లే తనకు గుర్తింపు వచ్చిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకుంటున్నారని అంతా అనుకుంటున్నారని, కానీ తన అనుమానం ప్రకారం ఆయనను గృహ నిర్బంధం చేశారని రేవంత్ రెడ్డి కామెంట్ చేశారు. ఇక రాష్ట్రంలో డీలిమిటేషన్‌పై బీజేపీ నేత లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలపై రేవంత్ ఫైర్ అయ్యారు. అవి అవగాహన లేని వ్యాఖ్యలని మండిపడ్డారు. లక్ష్మణ్ ఎలా డాక్టర్ అయ్యారో అర్థం కావడం లేదన్నారు. తెలంగాణను చాలా తెలివిగా మోసం చేస్తున్నారని విమర్శించారు. ఎన్ని సీట్లు పెరిగితే అన్ని మహిళా రిజర్వేషన్లు వస్తాయని, ఒకవేళ 50 శాతం సీట్లు పెంచితే 410 సీట్ల గ్యాప్ వస్తుందని తెలిపారు. నియోజకవర్గాల సంఖ్య పెరిగినా కూడా భౌగోళికంగా గ్యాప్ అలాగే ఉంటుందని అన్నారు. సీట్ల పెంపులో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రానికి కేవలం ఐదు ఉత్తరాది రాష్ట్రాల సీట్లు సరిపోతాయని, అదే జరిగితే దక్షిణాది రాష్ట్రాల సీట్లతో పని ఉండదని, ఇప్పటికే తమను పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పుడు ఎంతోకొంత దక్షిణాదిని గుర్తిస్తున్నారని, సీట్ల పెంపులో వ్యత్యాసం వస్తే బండి సంజయ్, కిషన్ రెడ్డిలకు రాజకీయంగా అవకాశాలు ఉండవని, దేశంలో నియంత పోకడలు వస్తాయని సీఎం రేవంత్ రెడ్డి సెటైర్లు వేశారు.

# రెండు దశల్లో దేశవ్యాప్త గణన

-మొదటిపేజీ తరువాయి

నిర్వహిస్తారు. దీని ద్వారా గృహాల పరిస్థితి, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఇంధనం, ఇంటర్నెట్ వంటి వసతులతో పాటు టీవీ, కంప్యూటర్, వాహనాలు వంటి ఆస్తుల వివరాలను సేకరిస్తారు. ఈ దశలో జనాభా గణన జరుగుతుంది. వ్యక్తుల పేరు, వయస్సు, లింగం, వైవాహిక స్థితి, కులం, మతం, విద్య, భాష, వైకల్యం, వలసలు, ఉపాధి వంటి పూర్తి వ్యక్తిగత వివరాలను సేకరిస్తారు. (హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి మంచు కురిసే ప్రాంతాల్లో ఇది సెప్టెంబర్ 2026లోనే జరుగుతుంది). ఈసారి జనగణనలో పౌరులకు ఒక ప్రత్యేక అవకాశం కల్పించారు. సాధారణంగా ఎన్యుమరేటర్ ఇంటికి వచ్చి వివరాలు సేకరించే విధానంతో పాటు, పౌరులు తమ వివరాలను స్వయంగా వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యుమరేషన్' సౌకర్యం అందుబాటులోకి రానుంది. వెబ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన తర్వాత, ఎన్యుమరేటర్ కేవలం ధృవీకరణ కోసం మాత్రమే ఇంటికి వస్తారు.

# యుద్ధం ఆపేలా కేంద్రం చొరవ చూపాలి

-మొదటిపేజీ తరువాయి

ఉందని భట్టి పేర్కొన్నారు. ఆయా దేశాల మధ్య ఉద్రిక్తతలు ఆగకపోతే ప్రపంచ దేశాల భవిష్యత్తు మరింత ఆందోళనకరంగా మారొచ్చని అభిప్రాయపడ్డారు. ఇది ఇప్పుడు ఆగకపోతే మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీయవచ్చని హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయెల్ – ఇరాన్ యుద్ధాన్ని ఖండిస్తున్నామని ఆయా దేశాల మధ్య శాంతి పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. యుద్ధాన్ని ఆపే దిశగా భారత ప్రభుత్వం ప్రయత్నం చేయాలని తీర్మానం చేస్తున్నట్లు ప్రకటించారు భట్టి విక్రమార్క.

# హేట్ స్పీచ్‌పై సర్కార్ ఉక్కుపాదం

హైదరాబాద్, మార్చి 30 (తీన్మార్ న్యూస్):

తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. స్పీకర్ ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫార్సు చేశారు. ఈ బిల్లును గత సోమవారం రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించింది. ఈ బిల్లుతో ఇక విద్వేష పూరిత ప్రసంగాలకు చెక్ పడనుంది. మతం, కులం, లింగం లేదా ఇతర కారణాల వల్ల సమాజంలో విద్వేషం, అశాంతిని రేకెత్తించే ప్రసంగాలు, రచనలు లేదా సోషల్ మీడియా పోస్టులను అరికట్టడానికి ఉద్దేశించిన చట్టమే హేట్ స్పీచ్ బిల్లు. ఇటువంటి చర్యలకు పాల్పడేవారిపై కఠినమైన జరిమానాలు, జైలు శిక్షలు (7 ఏళ్ల వరకు) విధించడం, ఈ నేరాలను నాన్–బెయిలబుల్‌గా పరిగణించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. విద్వేష పూరిత ప్రసంగాలు మొదటి సారి రుజువు అయితే ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. శిక్షతోపాటు రూ. 50 వేలు జరిమానా విధిస్తారు. ఇదే ఘటన మరోసారి పునరావృతమైతే జైలు శిక్ష పదేళ్లు, రూ. లక్ష జరిమానా విధిస్తారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో విద్వేష పూరిత ప్రకటనలు, ప్రసంగాలు సైతం పెరిగాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఇకపై సంఘం, సమూహం, సమావేశాల్లో ద్వేషపూరిత ప్రసంగాలు, రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు ఉండొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. మతం, జాతి, కులం, వర్గం, స్త్రీ, పురుష, లైంగిక, జన్మస్థలం, నివాసం, భాష, అశక్తత, తెగలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు, ప్రసంగాలు ఉండొద్దని ఈ బిల్లును తీసుకొచ్చింది. మాటల ముద్రణ, ప్రచురణ, ఎలక్ట్రానిక్ మాధ్యమం/సాధనాల ద్వారా సమాచార మార్పిడి ఉన్నా ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. ఈ బిల్లు ద్వారా ఎలాంటి అసభ్యకర కంటెంట్, సందేశం, సమాచారం ఉంటే వాటిని తొలగించాలని ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సర్వీస్ ప్రొవైడర్లను హెచ్చరించే అధికారం అధికారులకు ఉంటుంది. ఇక మీద సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడినా?, రెచ్చగొట్టే పోస్టులు చేసినా జైలు శిక్ష తప్పదు!

# అసెంబ్లీలో సన్నబియ్యం విందు

హైదరాబాద్, మార్చి 30 (తీన్మార్ న్యూస్):

రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా అసెంబ్లీ ఆవరణలోని డైనింగ్ హాలులో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రులు, ఎమ్మెల్యేల, ఎమ్మెల్సీలకు సన్నబియ్యంతో ప్రత్యేక భోజనం ఏర్పాటు చేశారు. పేద ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన సన్నబియ్యం పంపిణీ విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, రేషన్ షాపుల ద్వారా సామాన్యులకు అందుతున్న అదే నాణ్యమైన బియ్యంతో వండిన పదార్థాలను ప్రజాప్రతినిధులందరికీ వడ్డించారు. ఈ విందులో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పాల్గొని, మంత్రులు, అధికార, ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలతో కలిసి సన్నబియ్యం భోజనం చేశారు. అనంతరం వారు సన్నబియ్యం విందు భలే బాగుందంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కితాబిచ్చారు. పేదలకు అందుతున్న బియ్యం నాణ్యత ఏ విధంగా ఉందో ఈ సందర్భంగా ఆయన స్వయంగా పరిశీలించారు. ఇక సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు.

# కాళేశ్వరం వైఫల్యానికి “ప్లానింగ్ లోపాలే కారణం”

**రూ. లక్ష కోట్ల ప్రజాధనం వృథా**
**రాజ్యసభలో కేంద్రం వెల్లడి**
**కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్**



తెలంగాణ బ్యూరో, మార్చి 30 (తీన్మార్ న్యూస్):

కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం పేరుతో రూ. లక్ష కోట్ల ప్రజాధనం వృథా చేశారని, కాళేశ్వరం వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్ లోపాలే కారణం అని అన్నారు. రాజ్యసభలో అడిగిన ప్రశ్నలకు సోమవారం ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కాళేశ్వం ప్రాజెక్టు లోపాలపై కేంద్ర బృందం అధ్యయనం చేస్తోందని చెప్పారు. జల్ జీవన్ నిధుల వినియోగంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని చెప్పారు. తెలంగాణ వద్ద జల్ జీవన్ మిషన్ నిధులు రూ. 873 కోట్లు ఉన్నాయని వీటిలో నుంచి ఈ మూడేళ్లలో రూ. 194 కోట్లే ఖర్చు చేశారని హాట్ కామెంట్స్ చేశారు.

**కొత్త ప్రతిపాదనలేవి రాలేదు:**

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన కింద గత మూడేళ్లలో తెలంగాణ ప్రభుత్వం నుంచి కొత్త సాగునీటి ప్రాజెక్టుల ప్రతిపాదనలేవీ అందలేదని సీఆర్ పాటిల్ వెల్లడించారు. 99 ప్రాజెక్టులలో 71 పనులు చాలా కాలంగా నిలిచిపోయాయని ఆయన అన్నారు. తెలంగాణకు చెందిన 11 ప్రాజెక్టులను పీఎంకేఎస్వై – ఏఐబీపీ కింద చేర్చడం జరిగిందని వీటికి అర్హత కలిగిన కేంద్ర సహాయంగా రూ. 1,129.80 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టులకు మొత్తం రూ. 981.49 కోట్ల కేంద్ర సహాయం అందించిందని వెల్లడించారు.

# ఆడిటింగ్‌లో తీవ్ర నిర్లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

18 సంస్థలు మాత్రమే ఆడిటింగ్‌కు సహకరించగా, వాటి పనితీరును విశ్లేషించిన కాగ్ దిగ్భ్రాంతికర విషయాలను వెల్లడించింది. విశ్లేషణకు తీసుకున్న 18 సంస్థల్లో కేవలం 6 సంస్థలు మాత్రమే లాభాల్లో ఉండగా, 11 సంస్థలు భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. 9 సంస్థల నెట్ వర్త్ (నికర విలువ) నష్టాల కారణంగా పూర్తిగా కరిగిపోయింది. మొత్తం మీద ఈ సంస్థల నెట్ వర్త్ –?50,930 కోట్లకు పడిపోవడం గమనార్హం.

**రూ.25 కోట్ల నష్టం.**

ఈ సంస్థల్లో ప్రభుత్వం చేసిన మొత్తం పెట్టుబడులు ?98,572 కోట్లుగా ఉన్నాయి. సింగరేణి కాలరీస్ పై కాగ్ ప్రత్యేక ఆడిట్ నిర్వహించి కీలక అవకతవకలను గుర్తించింది. కొన్ని ఒప్పందాల్లో అవసరానికి మించి డీజిల్ వినియోగించినట్లు గుర్తించారు. కాంట్రాక్టుల్లోని లోపాల వల్ల ?251 కోట్ల మేర అనవసర ఖర్చు జరిగింది. నిబంధనల అమలులో వైఫల్యం వల్ల ?74 కోట్ల అదనపు భారం పడగా, బొగ్గు రవాణాలో లోపాల వల్ల ?25 కోట్ల నష్టం వాటిల్లింది. ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీల పేరుతో ?1,078 కోట్ల అదనపు వసూళ్లు జరిగినట్లు కాగ్ ఆక్షేపించింది.

**నియమ నిబంధనలు గాలికి**

సంస్థల పాలనలో తీవ్ర లోపాలున్నట్లు నివేదిక వేలెత్తి చూపింది. 15 సంస్థల్లో 9 సంస్థలకు స్వతంత్ర డైరెక్టర్లే లేరని ఎక్కడా డైరెక్టర్ల సమావేశాలు నిర్వహించలేదని 5 సంస్థల్లో ఆడిట్ కమిటీలు, 9 సంస్థల్లో ఎన్ఆర్సీ లేకపోవడం గమనార్హం. పర్యావరణ నిబంధనలను పాటించడంలోనూ సింగరేణి విఫలమైందని, ఎఫ్లువెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయలేదని కాగ్ పేర్కొంది.

**కాగ్ చేసిన కీలక సూచనలు**

పునఃసమీక్ష: నష్టాల్లో ఉన్న సంస్థల పనితీరుపై ప్రభుత్వం తక్షణమే సమీక్ష నిర్వహించాలి. పెండింగ్‌లో ఉన్న వార్షిక ఖాతాలను వెంటనే పూర్తి చేసి సమర్పించాలి. కాంట్రాక్టుల్లో లొసుగులు లేకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలి. పారిశ్రామిక వ్యర్థాల శుద్ధి ప్లాంట్లను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలి.

# గిగ్ వర్కర్స్ బిల్లుకు ఆమోదం

-మొదటిపేజీ తరువాయి

ఆరోగ్యపరమైన అంశాలు ఉన్నాయి.
ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వారికి ప్రభుత్వం తరుపున సాయం అందించడం లాంటివి ఉన్నాయి. ఈ బిల్లు ఎవరికీ వ్యతిరేకం కాదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి ఆధ్వర్యంలో లో గిగ్ వర్కర్స్ చట్టం తేవడం శుభపరిణామం. వారికి వృత్తిపరంగా ఇబ్బంది లేకుండా చట్టం చూసుకుంటుంది. గిగ్ వర్కర్ల బిల్లుపై హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ ప్రభుత్వం గిగ్ వర్కర్లకి అండగా ఉంటుంది' అని అన్నారు. మతపరమైన విద్వేషాలను రెచ్చగొడితే చర్యలు మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్ ప్రివెన్షన్ బిల్లు–2026ను ప్రవేశపెట్టింది. ఆ బిల్లును స్పీకర్ సెలెక్ట్ కమిటీకి రిఫర్ చేశారు. తెలంగాణ విద్వేష పూరిత ప్రసంగాలు, విద్వేష పూరిత నేరాల నిరోధక బిల్లు'కు రాష్ట్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. మత సామరస్యానికి భంగం కలిగించేలా సోషల్ మీడియాలో చేసే పోస్టులతో పాటు అల్లర్లు, ఘర్షణలను ప్రేరేపించేలా చేసే ప్రసంగాలను కట్టడి చేయడానికి ఈ బిల్లును రూపొందించారు.

# రాజకీయ ప్రేరేపిత కేసులు కొట్టివేయాలని పిటిషన్

-మొదటిపేజీ తరువాయి

నిందితుల తరపు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన తెలంగాణ హైకోర్టు. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ ప్రతివాదులైన ప్రభుత్వానికి, సంబంధిత పోలీసు అధికారులకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణను న్యాయస్థానం ఏప్రిల్ 9కి వాయిదా వేసింది. ఆ రోజున ప్రభుత్వం దాఖలు చేసే వివరణ ఆధారంగా కోర్టు తదుపరి నిర్ణయం తీసుకోనుంది.

# మావోయిస్టులకు డీజీపీ పిలుపు

-మొదటిపేజీ తరువాయి

పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం విధించిన డెడ్‌లైన్ మార్చి 31తో ముగియనున్న నేపథ్యంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మావోయిస్టు అగ్రనేత గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ్ రావు ఆరోగ్యం క్షీణించిందని తమకు సమాచారం ఉందని వెల్లడించారు. గణపతి గారు వెంటనే లొంగిపోవాలి. ఆయన లొంగిపోతే ప్రభుత్వ ఖర్చులతోనే పూర్తిస్థాయిలో మెరుగైన వైద్యం అందిస్తాం'అని భరోసానిచ్చారు. గణపతితో పాటు అజ్ఞాతంలో ఉన్న మరో ఏడుగురు ముఖ్య నేతలు కూడా వెంటనే లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రతి ఒక్కరికీ పునరావాసం కల్పించాం**

గత రెండేళ్ల కాలంలో సుమారు 721 మంది మావోయిస్టులు లొంగిపోయారని డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు. సరెండర్ అయిన ప్రతి ఒక్కరికీ హోదాలతో సంబంధం లేకుండా ప్రభుత్వం తరపున అన్ని రకాల ప్రయోజనాలతో పాటు మెరుగైన పునరావాసం కల్పించామని ఆయన గుర్తు చేశారు. ఆయుధాలు వీడి వస్తే, సమాజంలో తలెత్తుకుని జీవించేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. కాగా, మావోయిస్టులకు కేంద్ర ప్రభుత్వం విధించిన గడువు నేటితో ముగియనుంది. ఈ నేపథ్యంలో అజ్ఞాతంలో ఉన్న వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని లొంగిపోవాలని డీజీపీ శివధర్ రెడ్డి మరోసారి మీడియా ద్వారా స్టేట్‌మెంట్ ఇచ్చారు.

# 21 రాష్ట్రాల్లో తిరిగి కిరోసిన్ పంపిణీ

-మొదటిపేజీ తరువాయి



గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో గతంలో కిరోసిన్ రహిత రాష్ట్రాలుగా ప్రకటించిన ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్, గుజరాత్ వంటి 21 రాష్ట్రాలలో ఇప్పుడు తిరిగి కిరోసిన్ అందుబాటులోకి రానుంది. పంపిణీని వేగవంతం చేసేందుకు, కేవలం రేషన్ షాపులకే పరిమితం కాకుండా, ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన రెండు పెట్రోల్ బంకుల ద్వారా కూడా కిరోసిన్ విక్రయించేందుకు అనుమతి ఇచ్చారు. ప్రభుత్వం గుర్తించిన ఒక్కో సర్వీస్ స్టేషన్ గరిష్టంగా 5,000 లీటర్ల కిరోసిన్‌ను నిల్వ ఉంచుకోవచ్చు.

**ఎందుకు ఈ నిర్ణయం?**

ప్రస్తుతం పశ్చిమాసియా లో జరుగుతున్న యుద్ధ వాతావరణం కారణంగా ముడిచమురు మరియు ఎల్పీజీ సరఫరా గొలుసులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వంట గ్యాస్ కొరత ఏర్పడితే సామాన్యులకు ఇబ్బంది కలగకుండా, వంట మరియు వెలుతురు అవసరాల కోసం ప్రత్యామ్నాయంగా కిరోసిన్‌ను అందుబాటులోకి తేవాలని కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. కిరోసిన్ రవాణా, నిల్వ ప్రక్రియను సులభతరం చేసేందుకు పెట్రోలియం రూల్స్, 2002 నుండి కొన్ని మినహాయింపులు ఇచ్చారు. తద్వారా లైసెన్సింగ్ ప్రక్రియ వేగవంతమై, సామాన్యుడికి ఇంధనం త్వరగా అందుతుంది. అయితే, భద్రతా ప్రమాణాల విషయంలో మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ స్పష్టం చేసింది.

# నక్సలిజం దాదాపు అంతమైంది

ఆయుధాలను చేపట్టే వారిని కేంద్ర ప్రభుత్వం వదిలిపెట్టబోదని కేంద్రహోంశాఖమంత్రి అమిత్ షా హెచ్చరించారు. నక్సల్స్ అందరూ ఆయుధాలు వీడి జనజీవనంలో కలవాల్సిందేనని తేల్చిచెప్పారు. నక్సలిజం నిర్మూలనపై లోక్‌సభలో ప్రసంగించిన కేంద్ర హోం మంత్రి బస్తర్‌లో నక్సలిజం దాదాపు అంతమైందని తెలిపారు. బస్తర్‌లో ప్రతి గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేశామన్న అమిత్ షా, తెలంగాణలో అనేకమంది నక్సల్స్ నేతలు లొంగిపోయారని గుర్తు చేశారు. నక్సల్స్ రహిత దేశంగా భారత్‌ను మార్చామని అమిత్ షా వెల్లడించారు. కాంగ్రెస్ 60 ఏళ్లు అధికారంలో ఉన్నా ఆదివాసీల జీవితాల్లో మార్పు రాలేదని విమర్శించారు. ఎన్?డీఏ వచ్చాకే ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీ రు, విద్యుత్ సౌకర్యాలు వంటి మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. గిరిజన యువకులకు ఉపాధి కల్పించామని చెప్పారు. నక్సలిజంపై పోరులో ప్రజలు కూడా తమకు అండగా నిలిచారని వివరించారు. ఎందరో భద్రతా సిబ్బందిని నక్సలైట్లు పొట్టనపెట్టుకున్నారన్న అమిత్ షా దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని తెలిపారు.

**ప్రాణాలు తీసే హక్కు నక్సల్స్‌కు ఎక్కడిది?**

మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం, రాజ్యాంగాన్ని స్వీకరించాం. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని నక్సల్స్ గ్రహించాలి. స్కూళ్లు, బ్యాంకులు, ఆస్పత్రులు తగులబెట్టేవారి వల్ల అభివృద్ధి ఎలా సాధ్యం? ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందింది. ఇందిరాగాంధీ వల్లే మావోయిస్టు పార్టీ అన్ని ప్రాంతాలకూ విస్తరించింది. సైనిక బలగాలు, పోలీసులు, స్టేషన్లపై దాడి చేసి వాళ్లు ఆయుధాలు దోచుకెళ్లారు. నక్సల్స్ వద్ద ఉన్న వాటిలో 52 శాతం ఆయుధాలు పోలీసుల నుంచి దోచుకెళ్లినవేనని అమిత్ షా పేర్కొన్నారు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అభివృద్ధి గురించే ఆలోచిస్తున్నారని, అయితే మావోయిస్టుల ఎజెండాలో అభివృద్ధి అన్నది లేదని, వారు ఉనికి కోసమే పోరాడుతున్నారని అమిత్ షా పేర్కొన్నారు. నక్సలైట్లను భగత్‌సింగ్, బిర్సాముండా వంటివారితో పోల్చకూడదన్న ఆయన, ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారని ప్రశ్నించారు. నక్సలైట్లు తమ సిద్ధాంతాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారని, వారికి ఆదర్శం భారతీయులెవరూ కాదని, వారికి మావో ఆదర్శమని అమిత్ షా అన్నారు. ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదని అమిత్ షా స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందిందని ఆరోపించారు. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయని అమిత్ షా నిలదీశారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామంటూనే సాయుధ ఉద్యమాలను సమర్థిస్తున్న వారిని నేనొక్కటే అడుగుతున్నాను. మీరు రాజ్యాంగాన్ని గౌర విస్తారా? లేదా? ఎవరికైనా అన్యాయం జరిగితే దానికి పరిష్కా రం మన రాజ్యాంగంలో ఉంది. న్యాయస్థానాలు, శాసనస భలు, జిల్లా పరిషత్తులు, తహసీల్దార్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థను పూర్తిగా తిరస్కరించి ఆయుధాలను చేతుల్లోకి తీసుకుంటారా? ఎవరైతే వామపక్ష భావజాలాన్ని సమర్థిస్తున్నారో వాళ్లకు ఓ విషయం చెప్పాలనుకుంటున్నాను. సాయుధ పోరాటాలు చేసే రోజులు పోయాయి. ఇది నరేంద్ర మోదీ ప్రభుత్వం. ఎవరైనా ఆయుధాలు పట్టుకుంటే వాళ్లని వదిలిపెట్టం. ఇటువంటి ప్రవర్తనను ఎంతమాత్రం సహించేది లేదు.

**చిన్న పిల్లలకు తుపాకులు**

నక్సల్స్ చిన్నపిల్లలకు తుపాకులు, ఆయుధ సామగ్రి ఇచ్చారని, ఏజెన్సీ ప్రాంతాల యువతీయువకుల జీవితాలను వారు నాశనం అమిత్ షా ఆరోపించారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉందని, అందుకు కారణం విద్య, వైద్య, మౌలిక వసతులను నక్సల్స్ ధ్వంసం చేయడమే కారణమని పేర్కొన్నారు. రోడ్లు, విద్యుత్ లేకుండా గిరిజన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయని ఆయన ప్రశ్నించారు.

**చర్చల ద్వారానే పరిష్కారం**

దేనికైనా చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని, తుపాకులతో కాదని అమిత్? షా హితవుపలికారు. మాట్లాడితే ప్రజాస్వామ్యం అంటారు. మరి హింసను ఎలా సమర్థిస్తారు? కాంబోడియా, పెరూ, కొలంబియాలో భయంకర రక్తపాతం జరిగింది. దేశాభివృద్ధికి మావోయిస్టు సిద్ధాంతాలు, విధానాలు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి. మావోయిస్టుల రక్తపాత సిద్ధాంతాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. బస్తర్‌లో నక్సల్స్ అనేక ఏళ్లపాటు సమాంతర ప్రభుత్వం నడిపారు. ఆయుధాలు వీడాలని బస్తర్ వెళ్లి పలుమార్లు కోరాం. లొంగిపోయిన నక్సల్స్‌కు పునరావాసం, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నాం. కానీ నక్సల్స్? పలుచోట్ల రైలు బోగీలు తగలబెట్టారు. ప్రజల నుంచి డబ్బు వసూలు చేశారు. అంతేకాదు ప్రభుత్వ పథకాల అమలును కూడా నక్సలైట్లు అడ్డుకున్నారు. నక్సలిజం అభివృద్ధి కోసం రాలేదు. వామపక్ష భావజాల వ్యాప్తి కోసం వచ్చింది. నక్సలిజాన్ని రూపుమాపిన ఘనత కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలదే. మావోయిస్టు పార్టీ చైనా నుంచి వచ్చింది. చైనా నుంచి వచ్చిన పార్టీకి ఇక్కడి ప్రజల సమస్యలు ఎలా తెలుస్తాయి? మావోయిస్టు పార్టీ సిద్ధాంతం దేశాభివృద్ధి కాదు. ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాలపై తిరుగుబాటు చేయడమే వారి సిద్ధాంతం. మావోయిస్టు పార్టీ మూల సిద్ధాంతాలు దారుణంగా ఉంటాయి.

**ఎందుకు ఇన్ని వామపక్ష పార్టీలు?**

'మేం వచ్చిన 12 ఏళ్లలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. రష్యాలో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చాక ఇండియాలో సీపీఐ ఏర్పడింది. సీపీఐ ఏర్పాటు వెనుక రష్యా కమ్యూనిస్టుల హస్తం ఉందన్న వాదన ఉంది. కమ్యూనిస్టులు ఆంగ్లేయులను కూడా సమర్థించారు. సీపీఐ ఉన్నాక మళ్లీ సీపీఐ (ఎం) ఎందుకు ఏర్పడింది? సీపీఐ, సీపీఎం తర్వాత మళ్లీ మావోయిస్టు పార్టీ ఎందుకు ఏర్పాటైంది? 2004లో కొన్ని కమ్యూనిస్టు గ్రూపులు ఏకమై మావోయిస్టు పార్టీ ఏర్పడింది. అయితే నక్సల్స్‌ను సమర్థించేవారికి మానవత్వమే లేదు. నక్సల్స్ లక్షలమంది తల్లులకు గర్భశోకం కలిగించారు' అని అమిత్? షా అన్నారు.

**అంతా కాంగ్రెస్ వల్లే!**

'పేదలకు, పిల్లలకు ఆయుధాలు ఇచ్చినవారు మనుషులే కాదు. సల్వాజుడుం పేరుతో కాంగ్రెస్ పార్టీ అనేక దారుణాలు చేసింది. న్యాయమూర్తిగా పనిచేసిన సుదర్శనరెడ్డి తీర్పును ఖండిస్తున్నాం. జడ్జిలు తమ వ్యక్తిగత సిద్ధాంతాలను వృత్తిలో జోడించకూడదు. మేం వచ్చాక ఏజెన్సీ ప్రాంతాల్లో మొబైల్ టవర్లు నిర్మించాం. గిరిజన ప్రాంతాల్లో బ్యాంకులు, పోస్టాఫీసులు ఏర్పాటు చేశాం. ఏజెన్సీ ప్రాంతాల్లో ఏకలవ్య పాఠశాలలు, ఐటీఐలు, విద్యాలయాలు, ఆస్పత్రులు నిర్మించాం. ఏజెన్సీ ప్రాంతాల్లోని మౌలిక వసతుల కల్పనకు రూ.4 వేల కోట్లు ఖర్చు చేశాం' అని అమిత్? షా పేర్కొన్నారు.

# అసోంలో ఒకప్పుడు అస్థిరత, అశాంతి

అసోంలో ఒకప్పుడు దీర్ఘకాలం అస్థిరత, అశాంతి నెలకొన్నప్పటికీ, గత దశాబ్దంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నించిందని తెలిపారు. ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్న అసోంలో 'మేరా బూత్ సబ్సే మజ్‌బూత్ సంవాద్' కార్యక్రమంలో భాగంగా బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో మాట్లాడుతూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో హింసతో అల్లకల్లోలమైన అసోం ఇప్పుడు నూతన ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని మోదీ అన్నారు. బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం శాంతి స్థాపన కోసం కృషి చేయడంతో పరిస్థితులు మారాయని పేర్కొన్నారు. ఈశాన్య ప్రాంతంలో వివిధ సంస్థలతో 12 శాంతి ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. ఒక రాష్ట్ర అభివృద్ధికి శాంతి అత్యవసరమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. గత పదేళ్లలో నిజాయితీగా అమలు చేసిన శాంతి ఒప్పందాల వల్ల అసోంలో స్థిరత్వం నెలకొన్నట్లు చెప్పారు. యువత భవిష్యత్తు భద్రత కోసం బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

**కాంగ్రెస్‌పై విమర్శలు**

మునుపటి కాంగ్రెస్ ప్రభుత్వాలు కేవలం వార్తల్లో నిలిచేందుకు ఒప్పందాలు చేసేవని మోదీ విమర్శించారు. ఆ ఒప్పందాలు కాగితాలకే పరిమితమయ్యాయని, యువతను నిరాశలోకి నెట్టాయని అన్నారు. బోడో సమస్య సహా అనేక అంశాల్లో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్? పాలనలో తిరుగుబాటుదారులు, విద్యార్థి సంఘాలతో చేసుకున్న ఏ ఒప్పందమూ ఫలించలేదని



విమర్శించారు.

**మొదటిసారి ఓటర్లకు పిలుపు**

మొదటిసారి ఓటు వేయనున్న యువతకు గత కాంగ్రెస్ ప్రభుత్వాల దుష్పరిపాలన గురించి గుర్తు చేయాలని పార్టీ కార్యకర్తలకు ప్రధాని మోదీ సూచించారు. చిన్న తప్పిదం కూడా రాష్ట్రాన్ని మళ్లీ వెనక్కి నెడుతుందని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఏఐ రూపొందించిన వీడియోలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అలాగే అసోంలో ఈసారి కూడా హ్యాట్రిక్ విజయం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మోదీ తెలిపారు.

**బంగ్లాదేశ్ చొరబాటుదారులను అనుమతించింది కాంగ్రెస్ : నితిన్ నబీన్**

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బంగ్లాదేశీయులను అసోంలోకి అక్రమంగా ప్రవేశించేందుకు సహకరించిందని బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో అక్రమ వలసలను నియంత్రించలేదని, దీంతో బంగ్లాదేశీ చొరబాటుదారులు అసోంలోకి పెద్ద ఎత్తున ప్రవేశించారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితిని మార్చి అక్రమ వలసదారులకు నిష్క్రమణ చూపిస్తున్నామని తెలిపారు. మొరిగావ్ జిల్లాలో ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తూ ఈ మేరకు మాట్లాడారు.

**రాహుల్ గాంధీపై నబీన్ విమర్శలు**

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై కూడా నితిన్ నబీన్ విమర్శలు గుప్పించారు. దిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో అసోం సంప్రదాయ కండువా గమోచాను ధరించలేదని, ఇది రాష్ట్ర ప్రజల భావాలను దెబ్బతీసిందని అన్నారు. అదే సమయంలో మసీదులకు వెళ్లినప్పుడు టోపీ ధరిస్తారని ఆరోపించారు.

**'బీజేపీ పాలనలో అభివృద్ధి'**

గత పది సంవత్సరాల్లో బీజేపీ పాలనలో అసోంలో భారీ అభివృద్ధి జరిగిందని నబీన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో తీవ్రవాదం, హింస, పెట్టుబడిదారుల వెనుదిగడం, యువత నిరాశ వంటి సమస్యలు ఉండేవని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితులు మళ్లీ రాకుండా ప్రజలు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు.

**ఏప్రిల్ 9న అసోం అసెంబ్లీ ఎన్నికలు**

అసోంలో 126 అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో ఏప్రిల్ 9న ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. 2016 నుంచి బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అక్కడ అధికారంలో ఉంది. హ్యాట్రిక్ కోసం బీజేపీ ప్రయత్నిస్తుండగా, ఈసారి అసోంలో అధికారాన్ని చేపట్టాలని కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు చేస్తోంది.

# బీజేపీ, ఎల్‌డీఎఫ్ కుమ్మక్కు వల్లే శబరిమలపై మోదీ మౌనం

ఎక్కడికి వెళ్లినా ఆలయాలు, మతం గురించే మాట్లాడే ప్రధాని మోదీ, పాలక్కడ్ ఎన్నికల ప్రసంగంలో శబరిమల అంశంపై మౌనం వహించడం సరికాదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, వామపక్ష ఎల్‌డీఎఫ్ కూటమి కలిసి పనిచేస్తున్నందు వల్లే ఇలా జరిగిందని ఆయన ఆరోపించారు. మతం కంటే రాజకీయాలకు ప్రాధాన్యతను ఇచ్చినందు వల్లే, శబరిమల అంశాన్ని ప్రసంగంలో మోదీ ప్రస్తావించలేదన్నారు. శబరిమలలో ఏం జరిగిందో మర్చిపోయినట్లుగా మోదీ వ్యవహరించారని రాహుల్ విమర్శించారు. అధికార వామపక్ష కూటమి నేతలు అయ్యప్ప ఆలయం బంగారాన్ని స్వాహా చేసి దాని స్థానంలో ఇత్తడిని పెట్టారనే విషయాన్ని ప్రధాని మర్చిపోయారని ఆయన వ్యాఖ్యానించారు. అయ్యప్ప ఆలయానికి నెలవైన పాలక్కడ్ జిల్లాకు వచ్చినప్పుడు శబరిమల గురించి మాట్లాడకపోవడం సరికాదన్నారు. యూడీఎఫ్ కూటమి అధికారంలోకి వస్తే అయ్యప్ప ఆలయంలో జరిగిన అక్రమాలతో సంబంధమున్న వారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సోమవారం కేరళలోని పథనంతిట్ట జిల్లా అదూర్‌లో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు.

**ఎల్‌డీఎఫ్ కూటమిలో బీజేపీ రహస్య హస్తం**

"ఈసారి కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ – సీపీఎంలతో కూడిన ద్వయాన్ని కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంటోంది. ఈదఫా బీజేపీ పూర్తి మద్దతును కలిగిన వామపక్ష ఎల్‌డీఎఫ్ కూటమితో మేం పోరాడుతున్నాం. ఒక వైపు కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఉంది. మరోవైపు సీపీఎం – బీజేపీల ద్వయం ఉంది. ఎల్‌డీఎఫ్ కూటమిలో బీజేపీ రహస్య హస్తం దాగి ఉంది. సాధారణంగా రహస్య హస్తం లాంటి కాన్సెప్ట్‌లను మార్కెట్లతో



ముడిపడిన ఆర్థికవేత్తలు వినియోగిస్తుంటారు. కేరళలో కాంగ్రెస్ అధికారంలోకి రాకూడదని బీజేపీ కోరుకుంటోంది. ఎందుకంటే జాతీయ స్థాయిలో బీజేపీకి సవాల్ విసురుతున్న ఏకైక రాజకీయ శక్తి కాంగ్రెస్ మాత్రమే. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లతో మేం సైద్ధాంతికంగా పోరాడుతున్నాం. ఎల్‌డీఎఫ్ లాంటి కూటమి కేరళలో అధికారంలో ఉన్నా, తమ నియంత్రణలోనే పని చేస్తుందని బీజేపీ భావిస్తోంది. బీజేపీ నియంత్రణలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఉన్నందు వల్లే సీఎం పినరయి విజయన్‌పై ఒక్క కేసూ నమోదు కాలేదు. బీజేపీపై సీఎం పినరయి విజయన్ పల్లెత్తు మాట కూడా అనలేదు. బీజేపీ– ఎల్‌డీఎఫ్ కుమ్మక్కుకు ఇవే నిదర్శనాలు" అని రాహుల్ గాంధీ తెలిపారు.

**కేరళ సీఎంను ఎందుకు టార్గెట్ చేయడం లేదు?**

"కేంద్ర దర్యాప్తు సంస్థలన్నీ దేశంలోని విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. బీజేపీకి వ్యతిరేకంగా ఎవరు పోరాడినా దర్యాప్తు సంస్థల ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తోంది. అందుకే నాపైనా 36 కేసులను నమోదు చేశారు. నన్ను కంటిన్యూగా 55 గంటల పాటు ప్రశ్నించారు. కానీ కేరళలోని వామపక్ష ఎల్‌డీఎఫ్ కూటమి అధినాయకత్వంపై అలాంటి దర్యాప్తుల ఒత్తిడేం లేదు. కేరళ సీఎంను కానీ, అధికార ఎల్‌డీఎఫ్ కూటమి నేతలను కానీ కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకో టార్గెట్ చేయడం లేదు" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

**దేశాన్ని అదానీ, అంబానీల చేతుల్లో పెడుతున్నారు!**

"నేను ఈ ప్రసంగాన్ని మొదలుపెట్టేటప్పుడే మైక్ వైపు చూశాను. ఇదిగో దానిపై మేడ్ ఇన్ చైనా అని రాసి ఉంది. ఇండియాలో తయారైంది, కేరళలో తయారైంది అని దీనిపై ఎందుకు రాసిలేదు? మేడ్ ఇన్ ఇండియా వస్తువుల తయారీ అనేది లేకుండా మనం కేరళ యువత కోసం ఉద్యోగ అవకాశాలను ఎలా క్రియేట్ చేయగలం? కేరళ భవిష్యత్తును కేవలం 1 లేదా 2 కంపెనీలే కంట్రోల్ చేస్తే, మేడిన్ ఇండియా లక్ష్యాన్ని మనం ఎలా సాకారం చేసుకోగలం? మీ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రే ఈ దేశాన్ని అదానీ, అంబానీల చేతుల్లో పెడుతున్నారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వమే కమ్యూనిస్టు భావజాలాన్ని అణచివేస్తోంది. దీంతో అది కార్పొరేట్ ఫండెడ్ ప్రభుత్వంగా మారిపోయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ రాజీకి వచ్చినట్టుగా, నరేంద్రమోదీతో సీఎం పినరయి విజయన్ రాజీకి వచ్చారు. అవినీతి అభియోగాల ద్వారా విజయన్‌ను మోదీ కంట్రోల్ చేస్తున్నారు" అని రాహుల్ గాంధీ ప్రశ్నలు సంధించారు.

## సైనికులకు న్యాయం సులభంగా అందాలి



దేశ సైనికుల గురించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. సైనికులను వారి చట్టపరమైన హక్కుల కోసం సరిహద్దుల్లో ఒకటి, స్వదేశంలో మరొకటి, ఇలా ఒకేసారి రెండు యుద్ధాలు చేసేలా దేశం బలవంతం చేయకూడదని అన్నారు. సైనికులకు మెరుగైన న్యాయ సదుపాయం కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రపాలిత ప్రాంతం లేహ్ జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సీజేఐ సూర్యకాంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థకు, సాయుధ దళాలకు మధ్య ఉన్న పరస్పర సహకార సంబంధాన్ని సీజేఐ సూర్యకాంత్ ప్రముఖంగా ప్రస్తావించారు. న్యాయస్థానాలు రాజ్యాంగ విలువలను కాపాడుతుండగా, ఆ ఆదర్శాలు నిలబడటానికి అవసరమైన పరిస్థితులను సైనికులే సృష్టిస్తారని పేర్కొన్నారు. అలాగే 1962 నాటి రెజాంగ్ లా యుద్ధాన్ని సైతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రస్తావించారు. మేజర్ శైతాన్ సింగ్ భాటి, 13 కుమావోన్ రెజిమెంట్‌కు చెందిన చార్లీ కంపెనీలోని 114 మంది సైనికుల త్యాగాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. "రాజ్యాంగం హక్కులు, గౌరవం, సమానత్వం, న్యాయం గురించి మాట్లాడినప్పటికీ, దేశ ప్రజల కోసం ఆ వాగ్దానాలు నిలబడగలిగే పరిస్థితులను కల్పించిన పూర్తి ఘనత సైనికులకే దక్కుతుంది. ఒక దేశం తన సార్వభౌమత్వాన్ని, స్థిరత్వాన్ని, శాంతిని కాపాడుకోలేకపోతే, ఆ దేశం స్వేచ్ఛ, న్యాయం గురించి అర్థవంతంగా మాట్లాడలేదు. సైనికుల భూ వివాదాన్ని కూడా ఎదుర్కోవచ్చు. ఒక మాజీ సైనికుడు సర్వీసు లేదా సంక్షేమ హక్కుల కోసం ఇబ్బందులు పడొచ్చు. ఒక కుటుంబం పింఛనుకు సంబంధించిన జాప్యాలు, గృహ సమస్యలు, వైవాహిక కలహాలు సంబంధిత వ్యవహారాల్లో అధికార యంత్రాంగం ఉదాసీనతతో వ్యవహరించొచ్చు. దేశం తన సైనికులను ఒకేసారి రెండు యుద్ధాలు చేసే స్థితిలో ఎన్నడూ ఉంచకూడదు. చట్టం సైనికుడి వద్దకే వెళ్లాలి. ఎందుకంటే సైనికుడు ఎల్లప్పుడూ చట్టం వద్దకు వెళ్లలేడు. సైనికులకు న్యాయం సులభంగా అందాలి" అని సీజేఐ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు.

**'దేశాన్ని కాపాడేవారికి న్యాయ సహాయం అందించాలి'**

ఇది కేవలం సైనికుల సానుభూతికి సంబంధించిన విషయం మాత్రమే కాదని, ఒక రాజ్యాంగ విధి అని సీజేఐ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. దేశ సమగ్రతను కాపాడే వారికి ప్రభుత్వ సంస్థలు సకాలంలో న్యాయ సహాయం అందించాలని పేర్కొన్నారు. అలా చేయలేకపోతే ప్రభుత్వ సంస్థలు తమ నైతిక, రాజ్యాంగ బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైనట్లేనని అభిప్రాయపడ్డారు. తాను నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (చీుూుూ) కార్యనిర్వాహక అధిపతిగా ఉన్నప్పుడు రక్షణ సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు, పారామిలిటరీ దళాలు, సీఏపీఎఫ్ సభ్యులకు ఉచిత న్యాయ సహాయం, తోడ్పాటు, మద్దతు సేవలను అందించడానికి ప్రారంభించిన 'వీర్ పరివార్ సహాయ యోజన'ను ఈ సందర్భంగా సీజేఐ ప్రస్తావించారు. నల్సా కార్యనిర్వాహక ఛైర్మన్‌గా తాను ఉన్నప్పుడు సాయుధ దళాల కోసం ఈ పథకాన్ని రూపొందించి, అమలు చేయడం తన కెరీర్‌లోని గొప్ప ఘట్టాలలో ఒకటని అన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 14,929 మంది లబ్ధిదారులకు సహాయం అందించామని, 34 రాజ్య సైనిక్ బోర్డులు, 404 జిల్లా సైనిక్ బోర్డులతో సహా 438 న్యాయ సేవల క్లినిక్‌లను కార్యాచరణలోకి తెచ్చామని వెల్లడించారు. 'వీర్ పరివార్ సహాయ యోజన' కింద సేవలందించేందుకు విశ్వాసం, సానుభూతి సంస్కృతిని పెంపొందించేందుకు రక్షణ రంగ నేపథ్యం ఉన్న 378 మందితో సహా మొత్తం 1,123 మంది సిబ్బందిని నియమించినట్లు సీజేఐ సూర్యకాంత్ తెలిపారు. ఈ పథకం కింద ఆస్తి వివాదాలు, పెన్షన్ ఆలస్యం మొదలుకొని వైవాహిక కలహాలు, పాఠశాల ప్రవేశాల వరకు పలు సమస్యలను పరిష్కరించడం జరిగిందని చెప్పారు. సైనికులు సరిహద్దుల్లో ఉండి దేశాన్ని కాపాడుతున్నారని కొనియాడారు. సైనికుల ప్రయోజనాలన్నింటినీ పట్టుదలతో కాపాడటం దేశ సంస్థల కర్తవ్యమని అభిప్రాయపడ్డారు.

## ఏప్రిల్ 1 నుంచి జనగణన

దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన–2027 ప్రక్రియ మొదటి దశ ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా హౌజ్ లిస్టింగ్ – హౌజింగ్ సెన్సస్ (నూూ)ను నిర్వహించనున్నారు. వివాహం చేసుకోకుండా చాలాకాలంగా కలిసి ఉంటున్న జంటలను ఇకపై ఒకే కుటుంబంగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సహ జీవన జంటలను పెళ్లయిన దంపతులలాగే పరిగణించాలని డిసైడ్ చేసింది. ఈ మేరకు జనగణన నిబంధనల్లో కీలక మార్పులు చేశారు. తొలిసారిగా ప్రజలకు స్వయంగా తమ వివరాలను సెల్ఫ్ ఎన్యుమరేషన్ పోర్టల్‌లో నమోదు చేసుకునే అవకాశాన్ని ఇచ్చారు. ఈ క్రమంలో ప్రజల సందేహాలను తీర్చేందుకు తరుచుగా అడిగే 33 ప్రశ్నల సమాధానాలను ఆ పోర్టల్‌లో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా(ఆర్‌జీఐ) పొందుపర్చింది. హౌజ్ లిస్టింగ్ – హౌజింగ్ సెన్సస్ సందర్భంగా ఈ 33 ప్రశ్నలనే ప్రజలను ఎన్యుమరేటర్లు అడగనున్నారు.

**జనగణనలో ప్రజలిచ్చే సమాచారాన్ని ఎవ్వరికీ ఇవ్వం : ఆర్‌జీఐ**

ఈ సందర్భంగా సోమవారం రోజు విలేకరుల సమావేశంలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ కీలక వివరాలను వెల్లడించారు. జనగణన చట్టం (సెన్సస్ యాక్ట్)లోని సెక్షన్ –15 అనేది అత్యంత కీలకమైందని, దీని ప్రకారం జనగణన వేళ ప్రజలు అందించే సమాచారాన్ని విశ్వసనీయమైనదిగా పరిగణిస్తామని ఆయన తెలిపారు. చివరకు సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద కూడా ఆ సమాచారాన్ని తాము బహిర్గతపర్చమని స్పష్టం చేశారు. కోర్టులో రుజువుగానూ ఆ సమాచారాన్ని అందించమని, ఏ ఇతర సంస్థకూ ఈ వివరాలను అందించమని మృత్యుంజయ్ తేల్చి చెప్పారు. జనగణన ప్రక్రియలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. క్షేత్రస్థాయిలో జనగణనను నిర్వహించేందుకు యావత్ పాలనా యంత్రాంగాన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు వినియోగిస్తాయని పేర్కొన్నారు. చివరిసారిగా మన దేశంలో 2011లో జనగణన జరిగిందని, ఇది భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరుగుతున్న 8వ జనగణన అని మృత్యుంజయ్ చెప్పారు.

## నామినేషన్లు దాఖలు చేసిన స్టాలిన్, విజయ్

తమిళనాడు ముఖ్యమంత్రి, ఐవీఖ అధినేత వీఖ స్టాలిన్ చెన్నైలోని కొళత్తూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. నామ పత్రాలు దాఖలు చేసే సమయంలో ఆయన వెంట పార్టీ కీలక నేతలు ఉన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి బయటకు వచ్చిన తర్వాత స్టాలిన్ రోడ్ షో నిర్వహించారు. ప్రజలకు అభివాదం చేస్తూ తనను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా కొళత్తూర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులపై ఒక పుస్తకాన్ని విడుదల చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తన సొంత నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు ముఖ్యమంత్రి స్టాలిన్?. ఒకవైపు పరిపాలన వ్యవహారాలు చూస్తూనే, మరోవైపు పార్టీని గెలిపించే బాధ్యతను భుజాన వేసుకున్నారు. అయితే, కొళత్తూర్ నుంచి స్టాలిన్ నామినేషన్ వేయడం ఇది నాలుగోసారి. గతంలో మూడు సార్లు ఈ నియోజకవర్గం నుంచి బరిలో దిగి ఘన విజయం సాధించారు ముఖ్యమంత్రి స్టాలిన్. నామినేషన్ అనంతరం మాట్లాడిన స్టాలిన్, కొళత్తూర్ ప్రజలు తనకు వరుసగా నాలుగోసారి అఖండ విజయాన్ని అందిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు భారీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇదివరకు జరిగిన ఎన్నికలతో పోలిస్తే తమకు ఈ సారి ప్రజల్లో అపారమైన మద్దతు కనిపిస్తోందని స్టాలిన్? పేర్కొన్నారు. 'ఈసారి విజయం చాలా గొప్పగా ఉంటుంది. దిల్లీకి తమిళనాడు ఎదురు నిలుస్తుంది' అని స్టాలిన్ వ్యాఖ్యానించారు.

**రెండు స్థానాల్లో పోటీ చేయనున్న టీవీకే అధినేత విజయ్?**

మరోవైపు టీవీకే అధినేత విజయ్ కూడా పెరంబూర్ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సారి ఎన్నికల్లో విజయ్ రెండు చోట్ల పోటీ చేస్తున్నారు. మరొకటి తిరుచ్చి ఈస్ట్? నుంచి పోటీ చేస్తున్నారు. అయితే, నామినేషన్ అనంతరం విజయ్ రోడ్ షో నిర్వహించారు. ఏప్రిల్ 23న జరిగే ఎన్నికల్లో విజిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో డీఎంకే పాలనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎంకే ఓ దుష్టశక్తి అని, వారి పాలనలో మహిళలకు భద్రతే లేదని ఆరోపించారు. డీఎంకే నుంచి తమిళనాడును కాపాడుకోవాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

తీన్మార్

# డిజిటల్ ఆస్తికి రక్షణ కవచం

మానవ పరిణామ క్రమంలో సమాచారం ఎప్పుడూ ఒక శక్తిగానే ఉంటూ వచ్చింది. అక్షరం పుట్టిన నాటి నుండి నేటి అల్గారిథంల కాలం వరకు, సమాచారమే నాగరికతలను నడిపించింది. అయితే, ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో ఆ సమాచారమే అత్యంత విలువైన 'డేటా'గా, నవయుగ 'చమురు'గా రూపాంతరం చెందింది. ఈ డిజిటల్ విప్లవంలో సమాచారమే సంపదగా, అధికారం కావడంతో దానిని భద్రపరచు కోవడం అనేది వ్యక్తిగత మరియు జాతీయ స్థాయిలలో ఒక అనివార్యమైన అవసరంగా మారింది. ఈ నేపథ్యంలోనే, ప్రజలలో డేటా భద్రతపై చైతన్యం నింపేందుకు ప్రతి సంవత్సరం మార్చి 31వ తేదీని "ప్రపంచ బ్యాకప్ దినోత్సవం"గా నిర్వహిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం మన దైనందిన జీవితంలో నరనరాన జీర్ణించుకుపోయిన ప్రస్తుత తరుణంలో, డేటా భద్రతపై నిర్లక్ష్యం వహిస్తే అది ఊహించని నష్టాలకు దారితీస్తుంది. ఈ దినోత్సవం కేవలం ఒక వేడుక కాదు, మన డిజిటల్ జీవితానికి మనం వేసుకునే భద్రతా కవచం వంటిది. మన స్మార్ట్‌ఫోన్‌లు, కంప్యూటర్లు, సర్వర్లలో నిక్షిప్తమై ఉన్న సమాచారం ఏ క్షణమైనా అదృశ్యం కావచ్చని, దానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉండాలని హెచ్చరించడమే ఈ రోజు యొక్క పరమార్థం. ప్రపంచ బ్యాకప్ దినోత్సవం ఆవిర్భావం వెనుక ఒక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. 2011వ సంవత్సరంలో ఒక ప్రముఖ సామాజిక మాధ్యమ వేదికపై జరిగిన చర్చ దీనికి నాంది పలికింది. ఒక సామాన్యుడు తన కంప్యూటర్‌లోని అమూల్యమైన డేటాను కోల్పోయిన విషాదాన్ని పంచుకోగా, అది ప్రపంచ వ్యాప్తంగా వందలాది మందిని కదిలించింది. అందరూ తమ జీవితాల్లోని ఇలాంటి డేటా నష్టాలను ఏకరువు పెట్టడంతో, ఈ సమస్య ఎంత తీవ్రమైనదో ప్రపంచానికి అర్థమైంది. దీంతో డిజిటల్ భద్రతపై ప్రపంచ వ్యాప్త అవగాహన అవసరమని భావించి మార్చి 31ని ఎంచుకున్నారు. ఏప్రిల్ 1న వచ్చే 'ఏప్రిల్ ఫూల్' రోజున ఎవరూ తమ డేటాను కోల్పోయి నిజంగా 'ఫూల్' కాకూడదనే ఉద్దేశంతో, దానికి ముందు రోజైన మార్చి 31న "డోంట్ బి ఎన్ ఏప్రిల్ ఫూల్" అనే వ్యంగ్యాత్మక నినాదంతో ఈ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ చమత్కారం వెనుక ఒక గంభీరమైన హెచ్చరిక దాగి ఉంది. మీ డేటాను బ్యాకప్ చేయక పోవడం అంటే, మీ డిజిటల్ ఉనికిని ప్రమాదంలో పడేయడమేనని ఇది స్పష్టం చేస్తోంది. డేటా నష్టపోవడానికి కారణాలు పరిమితం కావు, అవి అనంతం. భౌతిక పరికరాల వైఫల్యం నుండి అత్యాధునిక సైబర్ దాడుల వరకు అనేక ముప్పులు పొంచి ఉన్నాయి. హార్డ్ డిస్క్ డ్రైవ్‌లు లేదా ఎస్.ఎస్.డిలు ఎప్పుడైనా సాంకేతిక లోపంతో ఆగిపోవచ్చు. సాఫ్ట్‌వేర్ క్రాష్ కావడం, అనుకోకుండా కీలకమైన ఫైళ్లను డిలీట్ చేయడం వంటివి నిత్యం జరిగే పొరపాట్లు. వీటికి తోడు ర్యాన్సమ్‌వేర్ వంటి భయంకరమైన వైరస్ దాడులు నేడు సంస్థలను గడగడలాడిస్తున్నాయి. హ్యాకర్లు మన డేటాను లాక్ చేసి, దానిని తిరిగి ఇచ్చేందుకు భారీగా డబ్బు డిమాండ్ చేస్తున్నారు. గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ప్రతి పది సెకన్లకు ఒక ర్యాన్సమ్‌వేర్ దాడి జరుగుతోందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రకృతి విపత్తులైన వరదలు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు మనం భౌతికంగా భద్రపరిచిన పరికరాలు కూడా కాలిపోవచ్చు లేదా కొట్టుకుపోవచ్చు. ఇలాంటి సమయాల్లో డేటా బ్యాకప్ లేకపోతే ఒక వ్యక్తి జీవితకాల కష్టం లేదా ఒక సంస్థ దశాబ్దాల చరిత్ర నిమిషాల్లో బూడిదైపోతుంది. దాదాపు 30 శాతం మంది వినియోగదారులు తమ జీవితంలో కనీసం ఒక్కసారైనా డేటా నష్టాన్ని ఎదుర్కొంటున్నారని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, హార్డ్‌వేర్ మార్చుకోవచ్చు కానీ, అందులో పోయిన డేటాను తిరిగి సృష్టించడం అసాధ్యం. బ్యాకప్ అంటే కేవలం ఒక ఫైలును కాపీ చేయడం మాత్రమే కాదు, అది ఒక క్రమశిక్షణతో కూడిన ప్రక్రియ. దీనిని ప్రధానంగా భౌతిక నిల్వ మరియు క్లౌడ్ నిల్వ అనే రెండు విధాలుగా విభజించవచ్చు. హార్డ్ డిస్క్, పెన్ డ్రైవ్ వంటి పరికరాలు వ్యక్తిగత నియంత్రణలో ఉంటాయి. కానీ, ప్రస్తుత క్లౌడ్ కంప్యూటింగ్ యుగంలో గూగుల్ డ్రైవ్, వన్‌డ్రైవ్, డ్రాప్‌బాక్స్ వంటి సేవలు విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. ఇవి ఆటోమేటిక్ బ్యాకప్ సౌకర్యాన్ని కల్పిస్తూ, డేటాను ఎక్కడి నుండైనా యాక్సెస్ చేసుకునే వెసులుబాటును ఇస్తున్నాయి. బ్యాకప్ చేసే విధానంలో కూడా ఫుల్ బ్యాకప్, ఇన్‌క్రిమెంటల్ బ్యాకప్ మరియు డిఫరెన్షియల్ బ్యాకప్ అనే మూడు కీలక పద్ధతులు ఉన్నాయి. మొత్తం డేటాను ఒకేసారి సేవ్ చేయడం మొదటి పద్ధతి అయితే, కేవలం మారిన ఫైళ్లను మాత్రమే సేవ్ చేయడం మిగిలిన రెండు పద్ధతుల ప్రత్యేకత. ఇవి సమయాన్ని, ఇంటర్నెట్ డేటాను ఆదా చేయడంలో తోడ్పడతాయి. సాంకేతిక నిపుణులు సూచించే అత్యంత ప్రభావవంతమైన సూత్రం "3-2-1 బ్యాకప్ రూల్". దీని ప్రకారం ప్రతి ఫైలుకు కనీసం మూడు కాపీలు ఉండాలి, వాటిని రెండు వేర్వేరు మీడియా రకాల్లో ఉంచాలి, మరియు ఒక కాపీని భౌతికంగా మన కార్యాలయం లేదా ఇంటికి దూరంగా మరో సురక్షిత ప్రదేశంలో ఉంచాలి. ఈ విధానం అనుసరిస్తే ఎలాంటి విపత్తు సంభవించినా డేటాను తిరిగి పొందడం సులభం అవుతుంది. వ్యాపార ప్రపంచంలో డేటా అనేది ప్రాణవాయువు వంటిది. నేటి కాలంలో డేటా లేని వ్యాపారాన్ని ఊహించలేము. చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలపై డేటా నష్టం చూపే ప్రభావం అత్యంత విధ్వంసకరంగా ఉంటుంది. ఒక సర్వే ప్రకారం, భారీ డేటా నష్టాన్ని ఎదుర్కొన్న చిన్న సంస్థలలో 60 శాతం ఆరు నెలల లోపే మూతపడు తున్నాయి. ఎందుకంటే సమాచారం లేనిదే లావాదేవీలు నిర్వహించడం, కస్టమర్ల వివరాలను తెలుసు కోవడం సాధ్యం కాదు. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆరోగ్య సంరక్షణ మరియు ఇ-కామర్స్ రంగాలలో డేటా భద్రత అనేది చట్టపరమైన బాధ్యత కూడా. రోగుల రికార్డులు లేదా ఆర్థిక లావాదేవీల డేటా లీక్ అయినా లేదా పోయినా, ఆ సంస్థలు కోట్లాది రూపాయల జరిమానాలతో పాటు ప్రజల విశ్వాసాన్ని కూడా కోల్పోతాయి. డేటా ప్రైవసీ చట్టాలు నేడు కఠినతరం కావడంతో, డేటాను భద్రపరచడం అనేది నైతిక బాధ్యతగా మారింది. కంపెనీలు తమ బిజినెస్ కంటిన్యూటీ ప్లాన్ (ఃఅఖ)లో భాగంగా బ్యాకప్ వ్యవస్థలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నాయి. వ్యక్తిగత స్థాయిలో మనం డేటాను కేవలం ఫైళ్లుగా చూడకూడదు, అవి మన జ్ఞాపకాలు. మన స్మార్ట్‌ఫోన్‌లలో ఉండే ఫోటోలు, వీడియోలు కేవలం చిత్రాలు మాత్రమే కాదు, అవి మన జీవితంలోని మధుర క్షణాలు. అలాగే విద్యా ధృవపత్రాలు, ఆస్తుల పత్రాలు, ఆధార్ వంటి గుర్తింపు కార్డుల స్కాన్ కాపీలు డిజిటల్ రూపంలో ఉన్నప్పుడు, మొబైల్ పోవడమో లేదా ఫోన్ పాడవ్వడమో జరిగితే ఆ నష్టాన్ని వెలకట్టలేము. ప్రతి ఏటా లక్షలాది మొబైల్ ఫోన్లు దొంగతనానికి గురవుతున్నాయి. ఒకవేళ మీరు ఆటోమేటిక్ క్లౌడ్ బ్యాకప్ ఆన్ చేసి ఉంటే, కొత్త ఫోన్ కొన్న నిమిషాల్లోనే మీ పాత సమాచారమంతా తిరిగి వస్తుంది. లేదంటే ఆ జ్ఞాపకాలు శాశ్వతంగా కనుమరు గవుతాయి. అందువల్ల, టెక్నాలజీపై అవగాహన పెంచుకుని, నిరంతరం సింక్రనైజేషన్ చేయడం ద్వారా మన వ్యక్తిగత డిజిటల్ సామ్రాజ్యాన్ని రక్షించుకోవచ్చు. ప్రభుత్వాలు కూడా నేడు డిజిటల్ పరిపాలన వైపు అడుగులు వేస్తున్నాయి. 'డిజిటల్ ఇండియా' వంటి బృహత్తర కార్యక్రమాల వల్ల కోట్లాది మంది ప్రజల వివరాలు సర్వర్లలో నిక్షిప్తమై ఉన్నాయి. భూ రికార్డుల నుండి సంక్షేమ పథకాల లబ్ధిదారుల వరకు అంతా డేటామయమే. ఇటువంటి

# మానవాళికి మహావీరుని సందేశం

భారతీయ ఆధ్యాత్మిక చరిత్రలో జైన ధర్మం ఒక ఉజ్వలమైన అధ్యాయం. ఈ ధర్మ పరంపరలో అత్యంత పావనమైన, పవిత్రమైన పండుగలలో మహావీర్ జయంతి అగ్రగామిగా నిలుస్తుంది. జైనమతాన్ని సార్వత్రిక మానవతా సందేశాలతో ప్రపంచానికి పరిచయం చేసిన వర్ధమాన మహావీరుడు కేవలం ఒక ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాదు, సమగ్ర నైతిక విలువలకు ప్రతీకగా నిలిచిన మహానుభావుడు. ప్రతి సంవత్సరం చైత్ర మాస శుక్ల పక్ష త్రయోదశి రోజున ఆయన జన్మదినాన్ని జైన సమాజం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటుంది. ఈ పర్వదినం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న జైన ఆలయాలు, ఆశ్రమాలు, పుణ్యక్షేత్రాలు భక్తులతో కళకళలాడుతాయి. భక్తులు ఆయన బోధనలను స్మరించు కోవడం ద్వారా తమ జీవన మార్గాన్ని పునఃసమీక్షించు కుంటారు. ప్రపంచవ్యాప్తంగా అశాంతి, హింస రాజ్యమేలుతున్న ప్రస్తుత తరుణంలో మహావీరుని అహింసా సిద్ధాంతం మునుపెన్నడూ లేనంత ప్రాసంగికతను సంతరించుకుంది. మహావీరుని జీవిత ప్రస్థానాన్ని పరిశీలిస్తే, అది ఒక సామాన్య రాజకుమారుడు 'జీవన్ముక్తుడు'గా మారిన అద్భుత ప్రయాణం అని అర్థమవుతుంది. క్రీస్తు పూర్వం 599 సంవత్సరంలో ప్రస్తుత బీహార్ రాష్ట్రంలోని వైశాలీ నగరానికి సమీపంలో గల కుందగ్రామంలో ఆయన జన్మించారు. ఆయన తండ్రి సిద్ధార్థుడు ఒక శక్తివంతమైన తెగకు రాజు, తల్లి త్రిశల దేవి. రాజకుటుంబంలో జన్మించిన వర్ధమానుడికి సకల భోగభాగ్యాలు అందుబాటులో ఉన్నప్పటికీ, ఆయన బాల్యం నుంచే విలక్షణమైన ప్రవృత్తిని కనబరిచారు. భౌతిక సుఖాల పట్ల ఆసక్తి చూపకుండా, అంతర్గత శాంతి కోసం తపించేవారు. వర్ధమానుడు పెరుగుతున్న కొద్దీ సంసార బంధాలు, రాజ్యపాలన తన ఆత్మ అన్వేషణకు అడ్డుగోడలని భావించారు. తన ముప్పై ఏళ్ల వయసులో, తల్లిదండ్రుల మరణానంతరం, ఆయన రాజ్యైశ్వర్యాలను, భార్యాబిడ్డలను, చివరకు తన వస్త్రాలను కూడా త్యజించి దిగంబర సన్యాసిగా అడవుల్లోకి వెళ్ళిపోయారు. ఈ త్యాగం మానవ చరిత్రలో ఒక గొప్ప మలుపుగా నిలిచిపోయింది. సన్యాస దీక్ష స్వీకరించిన తర్వాత మహావీరుడు సుమారు పన్నెండున్నర ఏళ్ల పాటు అత్యంత కఠోరమైన తపస్సు చేశారు. శీతోష్ణ స్థితులను లెక్కచేయక, ఆకలి దప్పులను జయించి, మౌన వ్రతాన్ని పాటిస్తూ ఆత్మసాక్షాత్కారం కోసం శ్రమించారు. ఈ సుదీర్ఘ సాధన అనంతరం ఆయన 'కేవల జ్ఞానం' (అనంతమైన జ్ఞానం) పొందారు. అప్పటి నుండి ఆయన 'మహావీరుడు' అని, ఇంద్రియాలను జయించిన 'జిన' అని పిలువబడ్డారు. జ్ఞానోదయం పొందిన తరువాత ఆయన మిగిలిన జీవితాన్ని ప్రజల అజ్ఞానాన్ని పోగొట్టడానికి, వారిలో నైతిక విలువలను పెంపొందించడానికి అంకితం చేశారు. ఆయన బోధనలలో అత్యంత ప్రధానమైనవి ఐదు మహా వ్రతాలు. అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం మరియు అపరిగ్రహం. ఈ ఐదు సూత్రాలు జైన ధర్మానికి పంచప్రాణాలు వంటివి. ఇవి కేవలం మునులకు, సన్యాసులకు మాత్రమే కాకుండా,



సామాన్య మానవులకు కూడా అనుసరణీయమైనవి. అహింస అనేది మహావీరుని బోధనలలో అన్నింటికంటే గొప్పది. "అహింసా పరమో ధర్మః" అని ఆయన చాటిచెప్పారు. హింస అంటే కేవలం భౌతికంగా చంపడం మాత్రమే కాదు, మాట ద్వారా గానీ, ఆలోచన ద్వారా గానీ ఎదుటి ప్రాణిని బాధపెట్టడం కూడా హింసేనని ఆయన స్పష్టం చేశారు. ప్రతి జీవిలోనూ ఆత్మ ఉంటుందని, అది తనలాగే సుఖదుఃఖాలను అనుభవిస్తుందని గుర్తించినప్పుడు మనిషి క్రూరత్వానికి స్వస్తి పలుకుతాడు. అందుకే "జీవదయే ధర్మం" అనే భావనను ఆయన సమాజంలో బలంగా నాటారు. ఈ అహింసా సిద్ధాంతం కేవలం మనుషులకే పరిమితం కాకుండా, పశుపక్ష్యాదులు, క్రిమికీటకాలు, చివరకు మొక్కల వరకు విస్తరించింది. పర్యావరణ పరిరక్షణ గురించి నేడు ప్రపంచం మాట్లాడుతున్న విషయాలను మహావీరుడు వేల ఏళ్ల క్రితమే తన బోధనల ద్వారా తెలియజేశారు. ప్రకృతిలో ప్రతి అణువుకు ప్రాణం ఉందని, దేనినీ అనవసరంగా నాశనం చేయకూడదని ఆయన బోధించారు. మహావీరుడు బోధించిన సత్యం అంటే కేవలం నిజం చెప్పడం మాత్రమే కాదు, అది నిష్కపటమైన ప్రవర్తనను సూచిస్తుంది. అస్తేయం అంటే దొంగతనం చేయకపోవడం, అంటే ఇతరులకు చెందిన ఏ వస్తువును వారి అనుమతి లేకుండా ఆశించకపోవడం. బ్రహ్మచర్యం అంటే ఇంద్రియ నిగ్రహం పాటించడం. ఐదవదైన అపరిగ్రహం అనేది నేటి వినియోగ సంస్కృతికి ఒక గొప్ప విరుగుడు. అపరిగ్రహం అంటే అవసరానికి మించి ఆస్తులను, వస్తువులను సేకరించకపోవడం. మానవుని అత్యాశే అన్ని అనర్థాలకు మూలమని గుర్తించిన మహావీరుడు, పరిమితమైన వనరులతో తృప్తిగా జీవించడం వల్లనే నిజమైన సుఖం లభిస్తుందని చెప్పారు. ఈ సూత్రాలను పాటించడం వల్ల సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గుతాయని, శాంతి నెలకొంటుందని ఆయన విశ్వసించారు. మహావీర్ జయంతి వేడుకలు కేవలం ప్రార్థనలకే పరిమితం కావు, అవి సేవా కార్యక్రమాలతో ముడిపడి ఉంటాయి. ఈ రోజున జైన భక్తులు ఉదయాన్నే లేచి ఆలయాలను సందర్శించి తీర్థంకరుల విగ్రహాలకు పవిత్ర జలాలు, పంచామృతాలతో అభిషేకం చేస్తారు. రథయాత్రలు నిర్వహిస్తూ 'మహావీర్ భగవాన్ కీ జై' అంటూ నినాదాలతో పురవీధులను పునీతం చేస్తారు. ఈ వేడుకల్లో అత్యంత ముఖ్యమైన భాగం దానధర్మాలు. ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం, రోగులకు వైద్య సాయం అందించడం, పశువులకు మేతను సమకూర్చడం వంటి పనులు మహావీరుని 'జీవకారుణ్య' సందేశానికి నిదర్శనాలు. సమాజంలోని అణగారిన వర్గాల పట్ల సానుభూతిని చూపడం ద్వారానే మనం మహావీరుని నిజమైన వారసులమవుతామని భక్తులు నమ్ముతారు.

మహావీరుని బోధనలలో మరొక అద్భుతమైన అంశం 'అనేకాంతవాదం'. ఒకే సత్యాన్ని వివిధ కోణాల్లో చూడవచ్చని, ఎదుటివారి అభిప్రాయాలను కూడా గౌరవించాలని ఈ సిద్ధాంతం చెప్తుంది. దీనివల్ల మతపరమైన, రాజకీయపరమైన విభేదాలు తొలగిపోయి, భిన్నత్వంలో ఏకత్వం సిద్ధిస్తుంది. నేటి కాలంలో మనుషుల మధ్య పెరుగుతున్న అసహనానికి ఈ సిద్ధాంతం గొప్ప పరిష్కారం చూపుతుంది. పరమత సహనం, పక్కవాడి ఆలోచనలోని సత్యాన్ని అన్వేషించడం వంటివి సమాజ సౌహార్దానికి పునాదులు. మహావీరుడు తన ప్రసంగాలను అప్పటి సామాన్యుల భాష అయిన ప్రాకృతంలో చేయడం వల్ల ఆయన సందేశం గడపగడపకూ చేరుకుంది. ఆయన సంస్కృతానికి బదులుగా ప్రాకృతాన్ని ఎంచుకోవడం ద్వారా జ్ఞానం అనేది అందరికీ అందుబాటులో ఉండాలని ఆశించారు. మహావీరుని 72 ఏళ్ల ప్రయాణం క్రీస్తు పూర్వం 527లో పావాపురిలో మోక్షం (నిర్వాణం) పొందడంతో ముగిసింది. అయితే ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన అందించిన జ్ఞానదీపం నిరంతరం వెలుగుతూనే ఉంది. ఆధునిక భారతదేశ నిర్మాణంలో మహాత్మా గాంధీ వంటి మహనీయులు అనుసరించిన సత్యం, అహింస అనే ఆయుధాలకు పునాది మహావీరుని సిద్ధాంతాలే అనడంలో సందేహం లేదు. సమాజంలోని కులవివక్షను వ్యతిరేకించి, స్త్రీ పురుష సమానత్వాన్ని ప్రోత్సహించిన సంస్కర్త ఆయన. జైన సంఘంలో స్త్రీలకు కూడా సన్యాస దీక్ష తీసుకునే అవకాశం కల్పించి, ఆధ్యాత్మిక రంగంలో వారికి సముచిత స్థానం కల్పించారు. ముగింపుగా చూస్తే, మహావీర్ జయంతి అనేది కేవలం క్యాలెండర్‌లో ఒక తేదీ కాదు. అది మనలోని అహంకారాన్ని, క్రోధాన్ని, స్వార్థాన్ని వీడమని హెచ్చరించే ఒక పిలుపు. అహింసను ఆయుధంగా మలుచుకుని మనస్సును గెలవడం ఎలాగో నేర్పిన ఆ దివ్య పురుషుడిని స్మరించుకోవడం అంటే, మనం కూడా ఆ మార్గంలో ఒక అడుగు ముందుకు వేయడమే. ప్రపంచం యుద్ధాల భయంతో వణికిపోతున్నప్పుడు, పర్యావరణం వినాశనం అంచున ఉన్నప్పుడు, మహావీరుని బోధనలు ఒక ఆశారేఖలా కనిపిస్తాయి. మన ప్రవర్తనలో మార్పు, తోటి జీవుల పట్ల ప్రేమ, ప్రకృతి పట్ల గౌరవం పెంచుకున్నప్పుడే మహావీర్ జయంతికి అసలైన సార్థకత చేకూరుతుంది. ఆ మహనీయుని సందేశాన్ని హృదయాలలో నింపుకుని, ఆచరణలో పెట్టడం ద్వారానే మనం శాంతియుత సమాజాన్ని నిర్మించగలం.

# నడిచే విజ్ఞాన సర్వస్వం కపిలవాయి

కపిలవాయి లింగమూర్తి (మార్చి 31, 1928 నవంబర్ 6, 2018) పాలమూరు జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, సాహితీ పరిశోధకుడు. పద్య రచనతో ఆయన ప్రస్థానం ఆరంభమైనా కథా రచన, విమర్శ ప్రక్రియతో వెలుగులోకి వచ్చారు. జానపద సాహిత్యం, పాలమూరు జిల్లా లోని దేవాలయాలపై విస్తృత పరిశోధనలు చేశాడు. 70 కి పైగా పుస్తకాలు రచించాడు. ఈయనకు కవి కేసరి అనే బిరుదు ఉంది. తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేటు అందుకున్న తొలివ్యక్తి కపిలవాయి లింగమూర్తి. ఆయన అచ్చంపేట తాలుకా, బల్మూర్ మండలం, జినుకుంటలో మాణిక్యమ్మ, వెంకటాచలం దంపతులకు మార్చి 31, 1928కు సరియైన ప్రభవ నామ సంవత్సరం మాఘ శుద్ధ నవమి నాడు జన్మించారు. ఆయనకు రెండున్నరేళ్ళ వయసులో తండ్రి మృతి చెందడంతో మేనమామ పెద లక్ష్మయ్య దగ్గర పెరిగారు. పాఠశాల విద్యను ఉర్దూ మాధ్యమంలో పూర్తి చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్ పరీక్షలు రాసి తెలుగులో విశారద ప్రమాణ పత్రాన్ని సంపాదించారు. అనంతరం ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి ఎం.ఏ. (తెలుగు) పట్టా పొంది 1954లో నాగర్‌కర్నూల్ జాతీయోద్యమ పాఠశాలలో తెలుగు పండితునిగా చేరారు. ఆ తర్వాత 1972 లో పాలెం శ్రీవేంకటేశ్వర ప్రాచ్య డిగ్రీ కళాశాలలో ఉపన్యాసకుడుగా చేరి దశాబ్దం పాటు సేవలందించి 1983లో ఉద్యోగ విరమణ పొందారు. లింగమూర్తి నడిచే విజ్ఞాన సర్వస్వంగా పేరుపొందారు. పలుగ్రంథాలు, పరిశోధనలు రచించి సాహితీవేత్తగా పేరుపొందాడు. కపిలవాయికి తెలుగు విశ్వవిద్యాలయం 26.8.2014 న గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. 30.08.2014 రోజున విశ్వవిద్యాలయం 13వ స్నాతకోత్సవంలో చాన్సలర్, రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ఆయనకు



గౌరవ డాక్టరేట్‌ను అందించారు. తెలంగాణ రాష్ట్రంలో తెలుగు యూనివర్సిటీ నుంచి తొలి గౌరవ డాక్టరేట్ పొందిన వ్యక్తిగా కపిలవాయికి ఈ ఘనత దక్కింది. 1954 నుంచి 1983లో పదవీ విరమణ పొందే వరకు నాగర్‌కర్నూల్ లోని జాతీయోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి, అక్కడే స్థిరపడ్డారు. అనేక స్థలచరిత్రలు, దేవాలయాల కథలకు ఆయన ప్రాణంపోశారు. మొత్తం 70 రచనలు ముద్రితమయ్యాయి. 11రచనలు ద్విముద్రితాలు, 25 రచనలు ముద్రించాల్సి ఉంది. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ కవులు, సాహితీ వేత్తలకు అన్యాయం జరిగింది. జీవోలు తెలుగులో రావాలి. పాఠశాలల్లో తెలుగు బోధించాలి అని సూచనలు చేశారు.ఆయన శతాధిక రచనలు చేశాడు. కపిలవాయి లింగమూర్తి కావ్యాలు, గీతాలు, శతకాలు, వచన సాహిత్యం, స్థల చరిత్రలు, బాల సాహిత్యం మొదలగు వివిధ సాహిత్య ప్రక్రియలలో రచనలు చేశారు. ఈ రచనలపై పలువురు విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పటికి వీరి రచనలపై వివిధ విశ్వ విద్యాలయాలలో ఆరు సిద్ధాంత గ్రంథాలు రూపొందినవి. 1992లో కవితా కళానిధి, పరిశోధనా పంచానన, 1996లో కవికేసరి, 2005లో వేదాంత విశారద,2010లో గురు శిరోమణి, 2012లో సాహిత్య స్వర్ణ సౌరభ కేసరి, సాహితీ విరాణ్మూర్తి తదితర బిరుదులు, సత్కారాలు పొందారు. కపిలవాయి లింగమూర్తికి సాహిత్య రంగంలో చేసిన విశేషకృషికి గుర్తింపుగా రాష్ట్ర స్థాయిలో అనేక సందర్భాలలో సన్మానాలు జరిగాయి. 1983లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వీరిని సన్మానించారు. తరువాత నారా చంద్రబాబు నాయుడు, వై.యస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నకాలం లోనూ వారిచే సన్మానాలు పొందారు. తెలంగాణ రాష్ట్ర సమితి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆయనను సన్మానించారు. నలుగురు ముఖ్యంత్రులచే సన్మానింపబడిన ఏకైక తెలుగు కవి, పరిశోధకులు కపిలవాయి లింగమూర్తి. ఇంకా తెలుగు విశ్వ విద్యాలయ ప్రతిభా పురస్కారం, బూర్గుల రామకృష్ణా రావు ప్రతిభా పురస్కారం, బ్రౌన్ సాహిత్య పురస్కారం, నోరి నరసింహ శాస్త్రి పురస్కారం, కందుకూరి రుద్రకవి పురస్కారం, పులికంటి సాహితీ పురస్కారం, బి.ఎన్.శాస్త్రి స్మారక పురస్కారం మొదలైన ఎన్నో సత్కారాలను పొందారు. వెన్నెల సాహిత్య అకాడమీ కపిలవాయి లింగమూర్తి జీవితం, సాహిత్య సృజన, పరిశోధనలపై కవితా కళానిధి కపిలవాయి లింగమూర్తి పేరుతో ఓ డాక్యుమెంటరీని రూపొందించింది. దీనికి 2011లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ రెండో డాక్యుమెంటరీ చిత్రంగా నంది అవార్డును ప్రకటించింది.

# దక్షిణ భారతంపై ఢిల్లీ పెత్తనం

భారతదేశం అనేది రాష్ట్రాల కలయికతో ఏర్పడిన ఒక సమాఖ్య. కానీ, నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి-ఆర్ఎస్ఎస్ కూటమి ఆ సమాఖ్య పునాదులను పెకిలించి, దేశాన్ని ఒకే రంగు, ఒకే భాష, ఒకే అధికార కేంద్రం కిందకు తెచ్చేందుకు ప్రమాదకరమైన వ్యూహాలను అమలు చేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల లేవనెత్తిన అంశాలు కేవలం రాజకీయ విమర్శలు కావు; అవి దక్షిణాది అస్తిత్వంపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా వినిపించిన హెచ్చరికలు. ఆర్థికంగా దోపిడీ చేస్తూ, రాజకీయంగా గొంతు నొక్కే ఈ 'నయా సామ్రాజ్యవాద' ధోరణిని దక్షిణాదిలోని ప్రజాస్వామిక, లౌకిక శక్తులు ఐక్యంగా ఎదిరించాల్సిన చారిత్రక అవసరం ఏర్పడింది. దక్షిణాది రాష్ట్రాలు-తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ-దేశ అభ్యున్నతిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. దేశ భౌగోళిక విస్తీర్ణంలో కేవలం 20 శాతం, జనాభాలో 19 శాతం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు, దేశ జీడీపీలో ఏకంగా 30 శాతం పైగా వాటాను అందిస్తున్నాయి. అయితే, కేంద్ర పన్నుల పంపిణీలో మనకు జరుగుతున్న అన్యాయం విస్మయానికి గురి చేస్తోంది. కర్ణాటక కేంద్రానికి రూపాయి పన్ను చెల్లిస్తే, తిరిగి పొందుతున్నది కేవలం 15 పైసలు మాత్రమే. తమిళనాడు చెల్లించే ప్రతి రూపాయికి 29 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయి. తెలంగాణ రూపాయికి దాదాపు 40 పైసల లోపే వాటా దక్కుతోంది. ఉత్తరప్రదేశ్, బీహార్ దీనికి భిన్నంగా, ఉత్తరప్రదేశ్ ఒక రూపాయి చెల్లిస్తే దాదాపు 2.70 రూపాయలు, బీహార్ ఏకంగా 7 రూపాయలకు పైగా తిరిగి పొందుతున్నాయి. అభివృద్ధి చెందినందుకు, జనాభా నియంత్రణ పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు శిక్ష వేయడం ఏ రకమైన న్యాయం దక్షిణాది కార్మికుల చెమట, ఐటీ నిపుణుల మేధస్సుతో వస్తున్న సంపదను ఉత్తరాదిలోని బీజేపీ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి మళ్లించడం ఒక రకమైన 'ఆర్థిక వలసవాదం' కాక మరేమిటి? 2026 తర్వాత జరగబోయే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాది రాజకీయ అస్తిత్వాన్ని నాశనం చేసేలా ఉంది. జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య తగ్గుతుంది లేదా స్థిరంగా ఉంటుంది. అదే సమయంలో, జనాభా విస్ఫోటనం జరిగిన హిందీ రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య భారీగా పెరుగుతుంది. దీనివల్ల దిల్లీ పీఠాన్ని అధిరోహించడానికి దక్షిణాది మద్దతు అవసరం లేని పరిస్థితి ఏర్పడుతుంది. పార్లమెంటులో దక్షిణాది గళం బలహీనపడి, మన ప్రాంతీయ ప్రయోజనాలు పూర్తిగా విస్మరించబడతాయి. ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. బాధ్యతాయుతంగా వ్యవహరించిన రాష్ట్రాలను శిక్షించి, బాధ్యతారాహిత్యంగా ఉన్న ప్రాంతాలకు రాజకీయ అధికారం కట్టబెట్టడం 'ఆర్ఎస్ఎస్' మార్క్ అఖండ భారత వ్యూహంలో భాగం. బిజెపి-ఆర్ఎస్ఎస్ కూటమి కేవలం నిధులను మాత్రమే దోచుకోవడం లేదు..

# ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్



**మహబూబాబాద్ జిల్లా, మార్చి 30 (తీన్మార్ న్యూస్):**

సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్ అన్ని విభాగాల జిల్లా అధికారులు, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, క్రిష్ణవేణి లతో అదేవిధంగా మండల అధికారులతో గూగుల్ మీట్ ద్వారా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చిన దరఖాస్తుదారులతో కలెక్టర్ స్వయంగా ఫిర్యాదులు తీసుకొని వారి యొక్క వినతులను సవివరంగా విని సంబంధిత విభాగాల అధికారులకు వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పెండింగ్ ఫైళ్లను, ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి తక్షణమే క్లియర్ చేయాలని, కార్యాలయాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు జవాబుదారీ తనంగా ఉంటూ సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన వసతి గృహాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పిల్లలతో కలిసి బ్రేక్ ఫాస్ట్, భోజనం, డిన్నర్ చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఇనుగుర్తి మండలం చిన్నముప్పారంకు చెందిన గుండ్ల ఉపేందర్ తాను ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూమి వేరొకరి పేరు మీద పట్టా మార్పు జరిగిందని అట్టి భూమి తిరిగి తన పేరు మేరు మీద మార్పు చేసి పట్టా పాసు పుస్తకము ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. గంగారం మండలం దుబ్బగూడెం గ్రామానికి చెందిన గ్రామస్తులు స్తానికంగా ఉన్న ఫర్టిలైజర్ దుకాణ యజమానులు ఎరువులను ఎక్కువ ధరలకు అమ్ముతున్నారని, అదేవిధంగా తమ గ్రామానికి కేటాయించిన మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని వేరే గ్రామానికి తరలించారని తమపై అధిక వడ్డీ వ్యాపారం చేస్తున్నారని, మొక్క జొన్న తక్కువ ధరకు కొనుగోలు చేసి చెల్లిస్తున్నారని అట్టి ఫర్టిలైజర్ యజమానులపై చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. గార్ల మండలం బాలాజీ తండ కు చెందిన సరోజ తనకు గతంలో ఇందిరమ్మ ఇల్లు వచ్చినట్లు రికార్డులో చూపిస్తుందని కానీ ఇప్పటివరకు తనకు ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ కాలేదని రికార్డులను పరిశీలించి తనకు ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా న్యాయం చేయాలని కోరారు. సీరోలు మండలం సీత్లా తండ గ్రామ పంచాయతీ అందనాల వీడుకు చెందిన అంగోతు లచ్చు తనకున్న 2.20 ఎకరాలకు 2024 సంవత్సరము నుండి ఇప్పటివరకు తన ఖాతాలో రైతు భరోసా డబ్బులు జమ అవట్లేవని పరిశీలించి తనకు రైతు భరోసా డబ్బులు ఇప్పించగలరని కోరారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన (168) దరఖాస్తులను సంబందిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జడ్పీ సీఈవో పురుషోత్తం, అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# జనగణన కార్యక్రమం సమర్ధవంతంగా నిర్వహించాలి

## డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోళీకేరి




**ములుగు జిల్లా, మార్చి 30 (తీన్మార్ న్యూస్):**

జనగణన-2027 మొదటి విడతలో భాగంగా చేపట్టనున్న ఇండ్ల గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జనగణన సంచాలకులు భారతి హోళీకేరి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా జనగణన అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జనగణన, ఇండ్ల గణన, మ్యాప్ తయారీ, ఎన్యుమరేటర్లు మరియు సూపర్వైజర్ల నియామకంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇండ్ల గణన ప్రక్రియను సక్రమంగా నిర్వహించేందుకు అధికారులందరూ పూర్తి అవగాహనతో పని చేయాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గణన చేపట్టాలని సూచించారు. దేశంలో తొలిసారిగా జనగణనను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 11 నుండి జూన్ 9 వరకు ఇండ్ల గణన కార్యక్రమం కొనసాగుతుందని, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. సన్నాహక చర్యలను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. యాప్ నిర్వహణలో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించాలని, గణన ప్రక్రియ నిరాటంకంగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలాల వారీగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం చేపట్టాలని, ప్రతి 300 ఇళ్లకు లేదా 750--800 జనాభాకు ఒక ఎన్యుమరేటర్‌ను నియమించాలని తెలిపారు. హౌస్ లిస్టింగ్ బ్లాకులను సిద్ధం చేసి క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, జిల్లాలో జనగణన-2027 మొదటి విడత ఇండ్ల గణన కార్యక్రమాన్ని సమన్వయంతో సక్రమంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, సూపరిండెంట్ మంజుల, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

### 4వ బెటాలియన్ లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం



**మామునూర్, మార్చి 30 (తీన్మార్ న్యూస్):**

మామునూర్ 4వ బెటాలియన్ ఆవరణలో నేడు, రేపు రెండు రోజులపాటు శరత్ మాక్స్ విజన్ సూపర్ మల్టీస్పెషలిటీ ఐ హాస్పిటల్ వైద్యులు డా. ఎన్. హనీల ఎమ్.బి.బి.ఎస్ కంటి వైద్యులు, వారి వైద్య బృందం నిపుణులైన కంటి వైద్యులచే ఉచిత పరీక్షలు నిర్వహించబడుతున్నవి. నేడు ఈ వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి హాజరై, డా.ఎన్.హనీల, కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమాండెంట్ డి.శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ బెటాలియన్ సిబ్బంది, అధికారులు,వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా రెండు రోజులపాటు కంటి వైద్య శిబిరాన్ని బేటాలియాన్లో ఏర్పాటు చేసాము. ఈ సదావకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డా. ఎన్.హనీల పర్యవేక్షణలో కంటి పరీక్షలు నిర్వహించి కంటి శుక్లాలు (కాటరక్ట్ ), కంటి పై దుర్మాంసం (ప్టెరీజిమ్), డయబెటీస్ ఉన్నవారికి డైయాబెటిక్ రేటినొపతిని నగదు రహితంగా ఆరోగ్య భద్రత స్కీం ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణప్రసాద్, ఆర్ఐ లు కార్తీక్,రవి, సర్వర్, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, కృష్ణ, బెటాలియన్ అధికారులు, బెటాలియన్ యూనిట్ మెడికల్ ఆఫీసర్స్ శ్రవణ్, శిరీష, బెటాలియన్ మెడికల్ సిబ్బంది రమేష్, సురేష్, మంజుల, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడి సెంటర్లో అన్నప్రాసన

## సర్పంచ్ జవ్వాజి రమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమం





**కొత్తపల్లి గోరి మార్చి 30 (తీన్మార్ న్యూస్):**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండలంలోని కొత్తపల్లె గ్రామపంచాయతీ పరిధిలో అంగన్వాడి సెంటర్లో కొత్తపల్లె గ్రామ వాస్తవ్యులు చెల్పూరి లిఖిత రాజు దంపతుల కుమార్తె నిత్యకు అన్నప్రాసన చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ జవాజి రమేష్ ముదిరాజ్ మాట్లాడుతూ పిల్లలకు సరైన పోషక పదార్థాలు అందించాలని ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ ప్రియాంకకి సూచనలు ఇవ్వడం జరిగింది. అలాగే అంగన్వాడీ సెంటర్ ను క్షుణ్ణంగా పరిశీలించి సెంటర్ యొక్క పరిస్థితులను అడిగి అంగన్వాడి టీచర్ ప్రియాంక గారిని తెలుసుకున్నారు. అలాగే గ్రామంలోని పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించి తగిన సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బొంకూరి శ్రీకాంత్ మరియు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్. తల్లిదండ్రులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు

### జనగణన కార్యక్రమం సమర్ధవంతంగా నిర్వహించాలి

**డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోళీకేరి**



**మహబూబాబాద్ జిల్లా, మార్చి 30 (తీన్మార్ న్యూస్):**

సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా జనగణన అధికారులతో జనగణన, ఇళ్ల గణన ప్రక్రియలు, మ్యాప్ తయారీ, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లు, సిబ్బంది శిక్షణ, డేటా సేకరణ విధానాలు వంటి అంశాలపై కలెక్టర్లకు సూచనలు అందించారు. జనగణన కార్యక్రమంలో భాగంగా ఇళ్ల గణన ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ నిర్వహణ, సాంకేతికత వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, గణన చేయాలని తెలిపారు. యాప్ నిర్వహణలో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించి ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. మండలాల వారీగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం చేపట్టాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. జిల్లా పరిధిలో సెన్సస్ కార్యక్రమం విజయవంతం అయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే శిక్షణా కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సి.పిఓ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

### జియో కోఆర్డినేషన్లతో హద్దులు నిర్ణయించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**మల్లంపల్లి, మార్చి 30 (తీన్మార్ న్యూస్):**

రామచంద్రపూర్ గ్రామంలోని భూములకు జియో కోఆర్డినేషన్ తో హద్దులు నిర్ణయించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. సోమవారం మల్లంపల్లి మండలం రామచంద్రపూర్ రైతు వేదికలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సర్వేర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రామచంద్రపూర్ గ్రామంలో రీ సర్వే చేపడుతున్న 10580 ఎకరాల భూమిని క్షుణ్ణంగా సర్వే చేయాలని, ప్రతి రైతు భూములను సర్వే నిర్వహించి జియో కోఆర్డినేషన్ ద్వారా హద్దులు నిర్ణయించాలని తెలిపారు. సర్వేయర్లు రైతులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సర్వే పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంకటేష్, తాసిల్దార్ విజయభాస్కర్ , సర్వే ఏడి కుసుమ కుమారి, డిప్యూటీ ఇన్స్పెక్టర్ సతీష్ చంద్ర,ఆర్ ఐ విజేందర్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

### ఎస్సీ, ఎస్టీ కేసులను సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

ఎస్పి సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మార్చి 30 (తీన్మార్ న్యూస్):**

ఎస్సీ, ఎస్టీ కేసులను సమీక్షిస్తూ సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పి సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోఎస్సి, ఎస్టి అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ త్వరితగతిన పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. నమోదైన అట్రాసిటీ కేసులు, పరిష్కరించిన కేసులు, బాధితులకు అందిన పరిహారం గురించి అధికారులు వివరించారు. జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు అందించిన వివరాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సభ్యులు తెలిపిన సమస్యల్లో జిల్లా స్థాయిలో ఉన్న సమస్యలు త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. క్షేత్రస్థాయిలో కేసు పూర్వాపరాలను పరిశీలించి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగే విధంగా అధికారులు చర్య తీసుకోవాలని సూచించారు. ఎస్సీ యాక్షన్ ప్లాన్ ప్రభుత్వం అందించిన విధివిధానాల మేరకు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పలు ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలలో ఎస్సీ, ఎస్టీలు లబ్ధిదారులకు ప్రాధాన్యత లభించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మానిటరింగ్ కమిటీ సభ్యులు పలు సమస్యలను ఎస్పి దృష్టికి తీసుకువచ్చారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల విషయంలో త్వరిత గతిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎఫ్ఐఆర్, చార్జిషీట్, పరిష్కారం అయిన కేసులు, విచారణలో ఉన్న కేసులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్సీ అభివృద్ధి అధికారి ఇందిర, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తదీతరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

**భద్రాద్రి :** ప్రజావాణి లో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించే విధంగా వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, గృహ నిర్మాణ శాఖాధికారి రవీంద్రనాథ్‌లతో కలిసి కలెక్టర్ ప్రజల వినతిపత్రాలను స్వయంగా స్వీకరించారు. జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా సమర్పించగా, వాటిని శ్రద్ధగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి తక్షణ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో స్వీకరించిన పలు దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై శాఖాధిపతులు వ్యక్తిగత పర్యవేక్షణ చేపట్టి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులో చర్యలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సమర్థవంతమైన పరిపాలన అందించడంలో అధికారులు కట్టుబడి ఉండాలని తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు కొత్తగూడెం మేదరబస్తీకి చెందిన మహమ్మద్ అబ్దుల్ వహాబ్, అశ్వరావుపేట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 911/33లో 5.00 గుంటల రిజిస్టర్ భూమి తన పేరున ఉన్నప్పటికీ, ఆర్ఎస్ఆర్ సమస్య కారణంగా పట్టాదారు పాస్‌పుస్తకం అందలేదని తెలిపారు. తన పేరున పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం భూభారతి విభాగానికి ఎండార్స్ చేశారు. టేకులపల్లి మండలం బేతంపూడి గ్రామానికి చెందిన ఆంగోతు సంతులాల్, సర్వే నంబర్ 239/282లో వ్యవసాయ భూమి



ఉన్నదని, గతంలో ఇంద్రజల ప్రభ పథకం కింద బోరు మరియు విద్యుత్ మంజూరు అయినప్పటికీ, మోటార్ మీటర్‌కు సర్వీస్ నంబర్ ఇవ్వలేదని తెలిపారు. తన విద్యుత్ కనెక్షన్ కొనసాగించేలా సర్వీస్ నంబర్ మంజూరు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి విద్యుత్ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు. ఆళ్ళపల్లి మండలం చెలగట్టు గ్రామానికి చెందిన కొమరం సారమ్మ, తన భర్త మరణంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, పీజీ (ఎంఏ) వరకు చదువుకున్న తన కుమార్తెకు ఉపాధి కల్పించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కు ఎండార్స్ చేశారు. కొత్తగూడెం మేదరబస్తీ 53వ డివిజన్‌కు చెందిన శ్రీనివాస్, గత ఎనిమిదేళ్లుగా తమ ఇంటికి కిన్నెరసాని మంచినీటి సరఫరా నిలిచిపోయినప్పటికీ నీటి బిల్లులు విధిస్తున్నారని తెలిపారు. నీటి బిల్లులను రద్దు చేసి కొత్త కనెక్షన్ మంజూరు చేయాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎండార్స్ చేశారు. పినపాక, ఏడుళ్ల బయ్యారం, జానంపేట మరియు టి. కొత్తగూడెం పరిసర ప్రాంతాలకు చెందిన ముస్లిం సోదరులు, రంజాన్ మరియు బక్రీద్ పర్వదినాలలో సామూహిక నమాజ్ నిర్వహించేందుకు తగిన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈద్గా స్థలం కేటాయించాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించి పినపాక తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ సర్పంచుల అసెంబ్లీ ముట్టడి..అరెస్టు

**హైదరాబాద్ :** చలో అసెంబ్లీ ముట్టడి బయలుదేరిన గాంధీభవన్ మార్గమధ్యలో మాజీ సర్పంచ్లను అరెస్టు చేసి అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని ముట్టడి చేపట్టారు. ట్టడం జరిగింది కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావలసిన గ్రామ పంచాయతీలకు పెండింగ్ బిల్లులు వచ్చిన గాని మాజీ సర్పంచులకు ఇవ్వడం లేదని మాజీ సర్పంచులు ఆరోపించారు. ముట్టడి కార్యక్రమములో భాగంగా అసెంబ్లీ వైపు వెళుతుండగా ఇంటలిజెన్స్ పోలీస్ సహకారముతో నయవంచక రేవంత్ ప్రభుత్వం పోలీస్ లు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. తెలంగాణ మాజీ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2019 -24 వరకు గ్రామాలలో అభివృద్ధి పనులు చేసిన మాజీ సర్పంచులు పెండింగ్ బిల్లులు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 29 నెలలు అవుతున్న బిల్లులు చెల్లించడం లేదని అసెంబ్లీ సమావేశంలో మంత్రులు,ఓ౦ లు మా సమస్యను పరిష్కరించాలి అని పెద్ద ఎత్తున బిల్లులు రావలసిన సర్పంచులు అసెంబ్లీ వద్దకు చేరుకొని నిరసన తెలపడం జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి గ్రామపంచాయతీలకు మాజీ సర్పంచులకు కేంద్ర ప్రభుత్వం నుంచి 15 ఆర్థిక సంఘం బిల్లులు చెల్లించడం లేదు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ాఊఅ నుండి పనిచేసిన బిల్లులు ాఆఈ స్టేట్ డెవలప్మెంట్ ఫండ్ నుంచి పనిచేసిన బిల్లులు కొంతమంది సర్పంచుల మన ఊరు మనబడి బిల్లులు సంవత్సరాల తరబడి ప్రభుత్వం చెల్లిస్తాదని ఎదురు చూసి ఎదురుచూసిన ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. వడ్డీలకు అప్పులు తేవడం వల్ల విపరీతంగా వడ్డీలు పెరిగిపోయినాయి ఆర్థికంగా మాజీ సర్పంచుల కుటుంబాలు చిన్నాభిన్నభావుతున్నది. కొంతమంది సర్పంచులు ఆత్మహ త్యలు కూడా చేస్తున్నారు. కొంతమంది సర్పంచులు చాలా ఆర్థిక ఇబ్బందులతో కృంగిపోతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంచాయతీరాజ్ మంత్రి సీతక్క మాజీ సర్పంచుల పెండింగ్ చెల్లించే విధంగా చర్యలు చేపట్టి మాజీ సర్పంచుల సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.

# రఘునాథపల్లిలో కాంగ్రెస్ కార్యకర్తల ఆగ్రహజ్వాల

**జనగామ :** తమ నేత కడియం శ్రీహరి యెడల పాశవికంగా ప్రవర్తించి, అమానుషమైన రీతిలో అవమానించిన హుజూరాబాద్ ఎమ్మెల్లే పాడి కౌశిక్ రెడ్డిని బీఆరెస్ పార్టీ బహిష్కరించాలని, స్పీకర్ ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దుచేయాలని గ్రంథాలయ సంస్థ జనగామ జిల్లా చైర్మన్ మార్జోడు రాంబాబు డిమాండ్ చేశారు. రఘునాథ్ పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో మండల అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్ నేతృత్వంలో రాస్తారోకో నిర్వహించి పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను కాంగ్రెస్ కార్యకర్తలు దహనం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ మారుజోడు రాంబాబు మాట్లాడుతు తెలంగాణ అసెంబ్లీలో స్టేషన్ఘన్పూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి మీద కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరిపోయేముందు అతిగావెలిగే దీపంలా మిడిసిపడడం కౌసిక్ రెడ్డి రాజకీయ పతనాన్ని సూచిస్తున్నదని ఆయన విమర్శించారు. దళితుల పట్ల దొరల అహంకారాన్ని ప్రదర్శిస్తూ, శాసనసభ సాక్షిగా విషం చిమ్మిన పాడి కౌశిక్ రెడ్డిని వెంటనే ఎమ్మెల్యే పదవి నుండి తక్షణమే తొలగించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ



కార్యక్రమంలో మాసంపల్లి లింగాజి, గాదె మహేందర్ రెడ్డి, మహమ్మద్ ఇబ్రహీం పాష, నామాల బుచ్చయ్య, గొరిగ రవి, కావటీ భాస్కర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కడారి రవి, లోనే రవీందర్, సిద్ధేశ్వర్, తోటకూర రమేష్, బాసుమియా, పోకల శివకుమార్, బొమ్మ వీరస్వామి, అబ్రహం, వల్లాల అశోక్, దేగల రాజశేఖర్, ఈరీహ నాయక్, లోగుంట్ల క్రాంతి, సింగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వాకిటి చంద్రారెడ్డి, మోతిలాల్ , రామచందర్ కుంకీస్ ప్రకాష్ రెడ్డి, బాల్రెడ్డి జిల్లా నాయకులు, మండల నాయకులు, స ర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు , కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నిషేధిత జాబితాలో కోటి ఎకరాలు

**హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ భూ కబ్జాల పర్వం కొనసాగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో ఈరోజు ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.వట్టినాగులపల్లిలో సతీశ్ షా కుటుంబానికి చెందిన 27 ఎకరాల భూమిపై మంత్రి పొంగులేటి కన్ను పడిందని కేటీఆర్ ఆరోపించారు. సుమారు రూ. 1,400 కోట్ల విలువ చేసే ఈ భూమిని దక్కించుకోవడానికి జేసీబీలతో వచ్చి గోశాలను, కాంపౌండ్ వాల్‌ను కూల్చివేశారని మండిపడ్డారు. భూమి ఇవ్వకపోతే సజీవంగా పాతిపెడతామని బాధితులను బెదిరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు రక్షణ కల్పించిన నిజాయతీ గల పోలీస్ అధికారి అజీబుల్లా ఖాన్‌ను మరుసటి రోజే బదిలీ చేయడం ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు నిదర్శనమని విమర్శించారు.రాష్ట్ర వ్యాప్తంగా కోటి



ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కేటీఆర్ ఆరోపించారు. నిజాం కాలం నాటి భూములను కూడా ఈ జాబితాలోకి చేర్చి, రైతులను భయాందోళనలకు గురిచేసి, భూములు గుంజుకోవాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు త్వరలోనే గవర్నర్‌ను కలుస్తామని, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.మంత్రి పొంగులేటి అక్రమ మైనింగ్, భూ కుంభకోణాలపై కేవలం సీబీసీఐడీ విచారణ సరిపోదని, వెంటనే సభా సంఘాన్ని (హౌస్ కమిటీ) వేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మంత్రి పదవిలో ఉంటే విచారణ నిష్పక్షపాతంగా జరగదని... పొంగులేటి తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీబీసీఐడీ విచారణ పేరుతో మంత్రిని కాపాడే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు.ఇదే సమయంలో పోలీసులకు కేటీఆర్ హెచ్చరికలు జారీ చేశారు. “పాలకుల ఒత్తిడికి లొంగి అక్రమాలకు సహకరిస్తే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదు” అని హెచ్చరించారు. అక్రమాలకు అండగా నిలవవద్దని, ప్రజల పక్షాన ఉండాలని పోలీసులను కోరారు. బాధితుల పేర్లు బయటపెట్టకుండా బీఆర్ఎస్ లీగల్ సెల్ ద్వారా వారికి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. భూ కబ్జాలకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఈ పర్యటనలో కేటీఆర్ వెంట పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ :** ప్రజావాణి అర్జీలపై విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం వహించవద్దని పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కి వస్తారని, ఫిర్యాదులపై ఆయా శాఖల అధికారులు సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్జీలను పెండింగ్లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో 225 ఫిర్యాదులు వినతులు వచ్చాయి. సంబంధిత అధికారులు పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వృద్ధుల వద్దకే స్వయంగా జిల్లా కలెక్టర్ వెళ్లి వినతి పత్రాలను స్వీకరించారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. సమస్యలను ఆలకించి తక్షణం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, ఆర్డీవో కే మహేశ్వర్ డి ఆర్ డి ఓ శ్రీధర్ గృహ నిర్మాణశాఖ పిడి శ్రీనివాసు పలు అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా గ్రామసభల నిర్వహణకు

## పూర్తిస్థాయి సమాచారంతో సిద్ధంగా ఉండాలి

**సిద్దిపేట :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2న జిల్లా వ్యాప్తంగా గ్రామసభల నిర్వహణకు పూర్తిస్థాయి సమాచారంతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమానికి ముందు జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2న గ్రామసభ కార్యక్రమం నిర్వహించి అన్ని శాఖలకు సంబంధించిన పథకాల అమలు పూర్తి వివరాలను గ్రామ సభలో ప్రజలతో పంచుకోవడం జరుగుతుంది కాబట్టి అన్ని శాఖలు పూర్తి వివరాలను గ్రామాల వారీగా సిద్ధం చేసి ఆయా మండలాల ఎంపీడీవోలకు పంపించాలని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే సబ్సిడీ గ్యాస్, సన్నబడ్లకు బోనస్, ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కొత్త రేషన్ కార్డుల జారీ తదితర అన్ని పథకాల వివరాలను అందించడంతోపాటు లబ్ధిదారులచే సభలలో మాట్లాడించాలని అన్నారు. ఇవే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, ప్రైమరీ స్కూల్ నుండి ఇంటర్మీడియట్ వరకు అల్పాహార పథకం , ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, దివ్యాంగ ఇంటర్మీడియట్ విద్యార్థులకు వాహనాల పంపిణీ తదితర కార్యక్రమాల గురించి కూడా చర్చించేందుకు అవసరమైన సమాచారం సేకరించాలని అన్నారు. అదేవిధంగా 99 రోజుల కార్యచరణలో భాగంగా ఏప్రిల్ మాసంలో నిర్వహించనున్న ఆరోగ్యం, రహదారి భద్రత, పిల్లల భద్రత మాదకద్రవ్యాలకు నో.. కార్యక్రమాలను కూడా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అబ్దుల్ హమీద్, డిఆర్ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైసు మిల్లర్ల నిర్లక్ష్యం..

## ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయాలు

**సూర్యాపేట :** హుజూర్ నగర్ లో దారుణం జరిగింది. రైస్ మిల్లర్లు నిర్లక్ష్యంతో ముగ్గురు చిన్నారులకు కాలిన గాయాలయ్యాయి. నిత్యం రద్దీ, జనావాసాల మధ్య రైస్ మిల్లులు వున్నాయి. రైస్ మిల్లులోని బాయిలర్ నుండి వచ్చే నిప్పు కనికల బుడిదను రోడ్డు పై రైస్ మిల్లర్స్ వేసారు. ఈ ఘటనలో విశాల్ (10), నాగ యశ్వంత్ (11), యశ్వంత్ (13) కాలినట్లు సమాచారం. మొదటగా విశాల్ బూడిదలో కాలుతూ కేకలు వేయడంతో స్పందించిన మరో ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయాలు అయ్యాయి. కాలిన చిన్నారుల ఆర్తనాదాలు స్థానికుల హృదయాలను కలిసివేసింది. గాయపడ్డ చిన్నారులను మెరుగైన వైద్యం కోసం ప్రవేట్ ఆసుపత్రులకు తరలించారు.

## అడ్లూరు గ్రామసభలో ఘర్షణ

## పలువురికి గాయాలు

**సూర్యాపేట :** కోదాడ మండలం అడ్లూరు కాలనీ గ్రామసభలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామ సర్పంచ్ గ్రామ నిధులు దుర్వినియోగం చేశారని ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యులు గ్రామ సభలో ప్రశ్నించడంతో ఘర్షణ తలెత్తింది. గ్రామస్థులు కర్రలతో కొట్టుకున్నారు. ఘటనలో పలువురికి గాయాలు అయ్యాయి. గ్రామ సర్పంచ్ భర్త, మరియు సర్పంచ్ మామ వారి అనుచరులు కలిసి ఉప సర్పంచ్ ను వార్డు సభ్యులను కొట్టడంతో ఘర్షణ తలెత్తింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, ఇరువర్గాలను చెదరగొట్టి కొంతమందిని కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇరు వర్గాలు కాంగ్రెస్ పార్టీ కావడంతో, కాంగ్రెస్ పెద్దలు .. సర్ది చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. .

## శరవేగంగా మల్లేశ్వరం

## ఐ ల్యాండ్‌లో కాటేజ్‌ల నిర్మాణం

**47.44 కోట్ల రూపాయలతో 30 కాటేజ్‌ల నిర్మాణం**

**వనపర్తి :** పనులను పరిశీలించిన జిల్లా పర్యాటక శాఖ కల్వరాల నరసింహ, గ్రామ సర్పంచ్ మధుగం బాలీశ్వరమ్మ నరసింహ.పెంట్లవెల్లి మండల పరిధిలోని మల్లేశ్వరం ఐ ల్యాండ్ లో ాయాఅఎ స్కీం ద్వారా పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవతో 47.44 కోట్ల రూపాయల నిధులతో 30 కాటేజ్ ల నిర్మాణానికి సంబదించిన పనులను నాగర్ కర్నూల్ ×జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ మరియు మల్లేశ్వరం గ్రామ సర్పంచ్ మధుగని నరసింహ పర్యవేక్షించారు.బికాటేజ్ ల నిర్మాణం పనులు డిసెంబర్ చివరి నాటికీ పూర్తి అయి 2027 సంవత్సరం నుంచి పర్యాటకులకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయని మల్లేశ్వరం ఐ ల్యాండ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారబోతుందని జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ తెలియజేసారు.

## జన నివాసాల మధ్య

## ఓ ఇంటిపై సెల్ టవర్ నిర్మాణ పనులు

**ఆపాలంటూ సూర్యాపేట పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీ వాసుల ఆందోళనజ**

**సూర్యాపేట :** జన నివాసాల మధ్య ఓ ఇంటిపై సెల్ టవర్ నిర్మాణ పనులు ఆపాలంటూ సూర్యాపేట పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు ఆందోళనకు దిగారు. సెల్ టవర్ నుండి వెలువడే రేడియేషన్ వల్ల క్యాన్సర్ లాంటి భయంకరమైన వ్యాధులు సోకే ప్రమాదముందంటూ ఆవేదన వ్యక్తం చేసారు. టవర్ నిర్మాణ పనులు ఆపాలంటూ ఎన్నిసార్లు చెప్పినా ఇంటి యాజమాని పట్టించుకోవడం లేదంటూ కాలనీ వాసుల ఆగ్రహం. రంగంలోకి దిగిన పోలీసులు, సెల్ టవర్ నిర్మించడానికి హైకోర్టు ఆర్డర్స్ ఉన్నాయని, నిర్మాణ పనులు ఆపితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని అంటున్నారు. ఈ నేపథ్యంలో కాలనీ వాసులకు పోలీసులకు మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. ఎన్ని కేసులు పెట్టినా టవర్ నిర్మాణ పనులు ఆపి తీరుతామని కాలనీ వాసులు అంటున్నారు.

## గ్యాస్ సిలిండర్ బ్లాక్ మార్కెట్ గుట్టు రట్టు

**స్మశాన వాటికలో సిలిండర్ల నిల్వ**

**హైదరాబాద్ :** బ్లాక్ మార్కెట్ లో కమర్షియల్ సిలిండర్ అమ్ముతున్న ముఠా గుట్టును టాస్క్ ఫోర్స్ పోలీసులు రట్టు చేసారు. పంజగుట్ట స్మశాన వాటికలో సిలిండర్ల తో నిల్వ చేసిన వైనం బయటపడింది. టాస్క్ ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాత్ మాట్లాడుతూ బంజారాహిల్స్ పీఎస్ లో ఈ దందా కి పాల్పడుతున్న 10 మంది పైన కేసు నమోదు చేసామని వెల్లడించారు. గ్యాంగ్ నుండి 420 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. బ్లాక్ దందా కి మెట్రో హెచ్ పి గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం పాల్పడుతున్నట్లు గుర్తించారు.

బిజినెస్

# మందగించిన ఆర్థిక సూచీల వృద్ధి

## కంపెనీలూ చర్యలు చేపట్టాలి



పశ్చిమాసియా సంక్షోభం వల్ల దేశీయంగా తలెత్తిన అంతరాయాలను చక్కదిద్దేందుకు, మన ప్రభుత్వం వేగంగా ప్రతిస్పందించి నందుకు భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆదివారం కృతజ్ఞతలు తెలిపింది. సరఫరా వ్యవస్థలు సక్రమంగా పని చేసేలా చూడటం, ఎగుమతిదా ర్లకు మద్దతు ఇవ్వడం, కుటుంబాలను కాపాడటం, స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని రక్షించడంపై ప్రభుత్వం సారించిందని వివరించారు. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించడానికి, పారిశ్రామిక కార్యకలాపాలు కొనసాగడానికి, ఉద్యోగాల రక్షణకు, జీవనోపాధికి ప్రభుత్వం మద్దతు ఇచ్చినట్లు వివరించారు. ప్రభుత్వ చర్యలకు తోడు, దేశీయ కంపెనీలు కూడా తగిన విధంగా స్పందించాలని 12 సూత్రాలను సీఐఐ తెలిపింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వం-పరిశ్రమల మధ్య నిరంతర సమన్వయం అవసరమని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ పేర్కొన్నారు. అయితే సరఫరా వైపు అంతరాయం ఉందని.. ఇంధన - రవాణా వ్యయాలు పెరగడం, వర్కింగ్ క్యాపిటల్‌లో ఒత్తిళ్లు పెరుగుతున్నట్లు సీఐఐ గమనించిందని బెనర్జీ వెల్లడించారు. పరిశ్రమల నిర్వాహకులు కూడా తగిన చర్యలు తీసుకోవాలని సీఐఐ సూచించింది..

## పెట్రోల్ బంకుల ద్వారా కిరోసిన్ పంపిణీ



మిడిల్ ఈస్ట్ వార్ నేపథ్యంలో దేశంలో ఇంధన కొరత ఏర్పడటంతో కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హార్మూజ్ జలసంధిలో ఏర్పడిన అంతరాయాల వల్ల భారతదేశానికి అందాల్సిన ఒఖఉ దిగుమతులు దాదాపు 50 శాతం మేర పడిపోయాయి. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు దేశీయంగా వంట గ్యాస్ కొరత ఏర్పడకుండా పెట్రోలియం భద్రతా మరియు లైసెన్సింగ్ నిబంధనలను తాత్కాలికంగా సడలిస్తూ కేంద్రం ఆదివారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా గతంలో నిలిపివేసిన పి.డి.ఎస్ (ఖఆూ) కిరోసిన్ పంపిణీని తిరిగి పునరుద్ధరించడమే కాకుండా, దానిని ఎంపిక చేసిన పెట్రోల్ బంకుల ద్వారా కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ నూతన విధానం ప్రకారం.. ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్, గుజరాత్ వంటి 21 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ సడలింపులు వర్తిస్తాయి. సాధారణంగా రేషన్ షాపులకే పరిమితమయ్యే కిరోసిన్, ఇప్పుడు ఎంపిక చేసిన పెట్రోల్ బంకుల్లో కూడా లభ్యం కానుంది. గ్యాస్ సిలిండర్ల కొరత భయాల నేపథ్యంలో తక్కువ ఆదాయ వర్గాలకు, గ్రామీణ ప్రాంత ప్రజలకు కిరోసిన్‌ను ఒక ప్రత్యామ్నాయ ఇంధనంగా అందుబాటులో ఉంచడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ తాత్కాలిక ఏర్పాటు సుమారు 60 రోజుల పాటు అమలులో ఉంటుంది. దీనికోసం ప్రభుత్వం అదనంగా 48,000 కిలోలీటర్ల కిరోసిన్‌ను కేటాయించింది. గృహ అవసరాలకు కిరోసిన్‌ను వాడుకునే వెసులుబాటు కల్పించడం ద్వారా వంటింట్లో గ్యాస్ వినియోగంపై ఒత్తిడిని తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తోంది. అయితే కాలుష్య కారకమైన కిరోసిన్ వాడకాన్ని తగ్గించి, పైప్డ్ నేచురల్ గ్యాస్(ఖఔఉ) వైపు ప్రజలను మళ్లించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, యుద్ధం వంటి అత్యవసర పరిస్థితుల్లో సామాన్యులను ఆదుకోవడమే ప్రథమ కర్తవ్యంగా ప్రభుతం ఈ చర్యలు చేపట్టింది.

పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో నెలకొన్న పరిమితులు ఆర్థిక సూచికల వృద్ధి మందగింపును సూచిస్తున్నాయని ఆర్థిక మంత్రిత్వశాఖ తన తాజా నివేదికలో పేర్కొంది. మార్చి నెలవారీ ఆర్థిక సమీక్షను ఆర్థిక వ్యవహారాల శాఖ (డిఇఎ) శనివారం విడుదల చేసింది. పశ్చిమాసియాతో బలమైన వాణిజ్య, పెట్టుబడి, విదేశాలకు నగదు బదిలీ సంబంధాలు కలిగిన భారతదేశానికి (ప్రధాన ఇంధన దిగుమతిదారు) ఈ సంఘర్షణలు "సంక్లిష్టమైన, బహుళ అంచెల ఆర్థిక ఇబ్బందులను" కలిగిస్తున్నాయని పేర్కొంది. "2026 మార్చి నాటి తొలి ఆర్థిక నివేదికలు ఈ ప్రపంచ పరిణామాల ప్రభావాన్ని ప్రతిబింబించేలా వృద్ధిలో మందగమనాన్ని సూచిస్తున్నాయి" అని నివేదిక తెలిపింది. "మార్చి 22 వరకు నెలవారీ ఇ ? వే బిల్లుల జారీ 5.3 శాతం తగ్గింది. ఇది వస్తువుల రవాణాలో కొంత మందగమనాన్ని సూచిస్తుంది. అయితే వార్షిక ప్రాతిపదికన లెక్కిస్తే.. ఇది 9.4శాతం అధికంగానే ఉంది. ఇంధన ధరల పెరుగుదల షాక్ తర్వాత ఉత్పత్తి వృద్ధిలో మందగమనాన్ని పిఎంఐ (పర్చేజింగ్ మానేజర్స్ ఇండెక్స్) సూచిస్తోంది" అని నివేదిక తెలిపింది. వాహన రిజిస్ట్రేషన్లు మార్చి 24 వరకు గతేడాదితో పోలిస్తే 19.1శాతం పెరిగాయని, మార్చి 22 వరకు డిజిటల్ చెల్లింపులు రెండంకెల వృద్ధిని కొనసాగించిందని తెలిపింది. గ్రామీణ ఆర్థిక పరిస్థితులు, అభిప్రాయాల సర్వే మార్చి 2026లో గ్రామీణ అభిప్రాయాల్లో కొంత తగ్గుదల ఉన్నట్లు సూచిస్తోంది. అయితే వినియోగ వృద్ధి బలపడింది. ఈ సర్వేను 2026 ఫిబ్రవరి చివరి వారంలో మరియు మార్చి



మొదటి వారంలో నిర్వహించినట్లు తెలిపింది.

భారతదేశం చమురు, ఎల్‌పిజి, ఎల్‌ఎన్‌జి అవసరాల కోసం దిగుమతులపై, ముఖ్యంగా పశ్చిమాసియా దేశాలపై ఆధారపడింది. దీంతో నిర్దిష్ట రంగాలపై స్థూల ఆర్థిక ప్రభావాన్ని కూడా నివేదిక చర్చించింది. అనేక రంగాల్లో ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలైన గాజు లేదా సిరామిక్స్ వంటి నిరంతరం ఉత్పత్తి కొనసాగే పరిశ్రమలకు ఇంధనాలను, ముడిపదార్థాలు అందకపోవడం తో ఉత్పత్తి కోతకు, తాత్కాలిక మూసివేతకు దారితీశాయని నివేదిక తెలిపింది. లభ్యత లేకపోవడం, వ్యయ పెరుగుదల రెండూ కూడా లాభాల మార్జిన్లు, ఉత్పత్తిపై ఒత్తిడిని తీవ్రతరం చేస్తున్నాయి. రవాణా అంతరాయాలు, సరఫరా మార్గాల మార్పులు, యుద్ధ ప్రమాద ప్రీమియంలతో సరుకు రవాణా, బీమా ఖర్చులు గణనీయంగా పెరిగాయని, అదే సమయంలో రవాణా ఆలస్యం కావడం, డెలివరీ సమయాన్ని పొడిగించాయని పేర్కొంది. దీంతో కీలకమైన ముడిసరుకుల దిగుమతులకు, ఎగుమతులకు నిబంధనలు తీవ్ర నష్టం కలిగిస్తోందని తెలిపింది.

# 66,500 డాలర్లకు పడిపోయిన బిట్ కాయిన్

ప్రస్తుతం అంతర్జాతీయ క్రిప్టో మార్కెట్‌లో డిజిటల్ కరెన్సీ అయిన బిట్‌కాయిన్ (ఃతిబిఇనీతిని) తీవ్రమైన ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. గత కొద్ది రోజులుగా బిట్‌కాయిన్ ధర 65,900 నుంచి 66,500 డాలర్ల మధ్య కొనసుగుతోంది.మార్చి 27న 65,720 డాలర్ల కనిష్ట స్థాయికి కూడా పడిపోయింది. గత 24 గంటల్లో సుమారు 1 శాతం, గత వారం రోజుల్లో దాదాపు 4 శాతం మేర విలువను కోల్పోయిన బిట్‌కాయిన్, ఈ ఏడాదిలో ఇప్పటికే మూడుసార్లు ఇదే స్థాయి వద్ద నిలదొక్కుకుంది. అయితే, ఈసారి అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఈ సపోర్ట్ లెవల్ ఎంతవరకు నిలబడుతుందనేది ఇప్పుడు మార్కెట్ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. బిట్‌కాయిన్ ధరల ఆకస్మిక పతనానికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి. మొదటిది మిడిల్ ఈస్ట్ వార్ ఉద్రిక్తల నేపథ్యంలో ఇన్వెస్టర్లు భయాందోళనకు గురై బిట్‌కాయిన్ వంటి రిస్క్ ఎక్కువగా ఉండే ఆస్తులను విక్రయించి, సురక్షితమైన బంగారం వంటి వాటిపై పెట్టుబడులు పెడుతున్నారు. రెండవది మార్చి 27న ముగిసిన సుమారు 14 బిలియన్ల డాలర్ల విలువైన ఆప్షన్స్ ఎక్స్‌పైరీ. ఈ భారీ ఎక్స్‌పైరీ కారణంగా ట్రేడర్లు తమ పొజిషన్లను క్లోజ్ చేయడం వల్ల మార్కెట్‌లో విపరీతమైన అమ్మకాల ఒత్తిడి ఏర్పడింది. ఇక మూడవది అమెరికా




ఫెడరల్ రిజర్వ్ (ఈవట) సమావేశం తర్వాత వడ్డీ రేట్లు తగ్గకపోవచ్చనే అంచనాలతో రిస్క్-ఆఫ్ సెంటిమెంట్ బలపడి, క్రిప్టో మార్కెట్ మొత్తం రెడ్ మార్క్‌లో ట్రేడ్ అవుతోంది. దీంతో రానున్న రోజుల్లో బిట్‌కాయిన్ గమనం ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఒకవేళ ప్రస్తుతం ఉన్న 66,000 డాలర్ల వద్దనే నిలబడితే, మార్కెట్ తిరిగి పుంజుకుని 68,000 నుంచి 70,000 డాలర్లకు చేరే అవకాశం ఉంది. కానీ, ఒకవేళ ఈ సపోర్ట్ బ్రేక్ అయితే మాత్రం, ధర నేరుగా 60,000 డాలర్లకు పడిపోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. కేవలం బిట్‌కాయిన్ మాత్రమే కాకుండా ఎథరియం, సొలానా వంటి ఇతర ప్రధాన క్రిప్టో కరెన్సీలు కూడా 3 నుండి 5 శాతం మేర నష్టపోవడం వల్ల మార్కెట్ అంతా అనిశ్చితిలో ఉంది. ఇరాన్ చర్చల ఫలితాలు, పెరుగుతున్న చమురు ధరలు, ఫెడ్ తీసుకునే తదుపరి నిర్ణయాల బట్టి బిట్‌కాయిన్ ధరల్లో త్వరలోనే పెను మార్పులు సంభవించే అవకాశం ఉంది.

# చానాళ్లకు జెర్సీ మారింది..

# ఇద్దరిలో అదరగొట్టేది ఎవరు..!

ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో ఆసక్తికర పోరుకు వేళైంది. తొలి సీజన్ ఛాంపియన్ రాజస్థాన్ రాయల్స్ ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ మధ్య బిగ్ ఫైట్ జరుగనుంది. ఐపీఎల్‌లో రెండు జట్లు తలపడడం కొత్తేమీ కాదు. కానీ, ఈసారి మాత్రం అభిమానులు ఈ మ్యాచ్ కోసం ఎదురుచూ స్తున్నారు. అందుకు కారణం రవీంద్ర జడేజా సంజూ శాంసన్ జెర్సీ మారడమే. సీజన్‌కు ముందు ట్రేడ్ పద్ధతిన సంజూ సీఎస్కే గూటికి చేరగా.. ఆరంభంలో ఆడిన రాజస్థాన్‌కు జడ్డూ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఒకప్పుడు సొంత జట్టుకు పోటీగా ఆడబోతున్న ఈ ఇద్దరు తొలి మ్యాచ్‌లో ఏ మేరకు రాణిస్తారోనని అభిమానులు కోటి కళ్లతో వేచి చూస్తున్నారు. పంతొమ్మిదో సీజన్‌లో ఫ్రాంచైజీ మారిన ఆటగాళ్లు చాలామందే. కానీ, సంజూ శాంసన్, రవీంద్ర జడేజాలు అందరికంటే ప్రత్యేకం. ఎందుకంటే.. ఒకే జట్టుకు నమ్మకస్తులుగా, మ్యాచ్ విజేతలుగా పేరొందని వీరిద్దరి జెర్సీరంగు మారింది. ట్రేడ్ పద్ధతిలో రూ.18 కోట్లకు సంజూను దక్కించుకున్న చెన్నై సూపర్ సింగ్స్ బదులగా రవీంద్ర జడేజా(రూ.14 కోట్లు), సామ్ కరన్(రూ.2.4కోట్లు)లను ఆ జట్టుకు ఇచ్చేసింది. దాంతో.. శాంసన్, జడేజాలు ఈ సీజన్‌లో తమ జట్లను గెలిపించాలనే పట్టుదలతో ఉన్నారు. 11 ఏళ్లుగా రాజస్థాన్‌కు ఆడిన సంజూ 5 ఏళ్లు సారథిగా కొనసాగాడు. ఓపెనర్‌గా శుభారంభాలు ఇస్తూ.. సారథిగా రాణించి జట్టును ఓసారి ఫైనల్ చేర్చినా టైటిల్ అందించలేపోయాడు. మరోవైపు జడేజా సీఎస్కే





స్టార్‌గా అవతరించి మూడు ట్రోఫీలు గెలుపొందాడు. 2012లో చెన్నై సూపర్ కింగ్స్‌కు

టీమిండియా స్టారైన జడేజా ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ ముందు రాజస్థాన్ గూటికి చేరాడు. ఆరంభ ఎడిషన్‌లో దివంగత షేన్ వార్న్ సారథ్యంలో టైటిల్ గెలిచిన జట్టులో సభ్యుడైన జడ్డూ.. 2012లో చెన్నై సూపర్ కింగ్స్‌కు మారాడు. ధోనీకి కుడి భుజంలా పేరొందిన ఈ ఆల్‌రౌండర్ 2018, 2021, 2023లో సీఎస్కే విజేతగా నిలవడంలో కీలమయ్యాడు. 17 ఏళ్ల విరామం తర్వాత మళ్లీ రాజస్థాన్‌కు మారిన జడేజాకు కెప్టెన్సీ ఇస్తారనే వార్తలు వినిపించాయి. కానీ, రియాన్ పరాగ్‌కు యాజమాన్యం ఓటేసింది. దాంతో.. ఇంతకుముందు ఎల్లో జెర్సీతో బ్యాటుతో, బంతితో చెలరేగినట్టు ఇప్పుడు గులాబీ జెర్సీలో మెరవాలని జడేజా భావిస్తున్నాడు.

అటు సంజూ, ఇటు జడేజా.. దిగ్గజ ఆటగాళ్లైన ఈ ఇద్దరు ఇప్పుడు తమ పాత జట్టుపై తమ తడాఖా చూపించేందుకు సిద్ధమవుతున్నారు. గువాహటిలోని బర్సాపర క్రికెట్ స్టేడియంలో రాత్రి 7:30 గంటలకు సీఎస్కే, రాజస్థాన్ మ్యాచ్‌లో వీరిద్దరిలో అదరగొట్టేది ఎవరు? అనేది ఉత్కంఠ రేపుతోంది. ఆల్ ది బెస్ట్ లెజెండ్స్.

## నేను ముందే చెప్పాను కదా!: అంపైర్‌తో రోహిత్ శర్మ

టీమిండియా దిగ్గజ కెప్టెన్, ముంబై ఇండియన్స్ స్టార్ రోహిత్ శర్మ ఐపీఎల్-2026 టోర్నీని ఘనంగా ఆరంభించాడు. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఆదివారం నాటి మ్యాచ్‌లో ఈ ఓపెనింగ్ బ్యాటర్ వింటేజ్ హిట్‌మ్యాన్‌ను గుర్తుచేశాడు. కేవలం 38 బంతుల్లోనే ఆరు ఫోర్లు, ఆరు సిక్సర్ల సాయంతో 78 పరుగులు సాధించాడు. ఇక ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ కోల్‌కతాపై ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తద్వారా 2012 తర్వాత తొలిసారి ఐపీఎల్‌లో తమ ఆరంభ మ్యాచ్‌లో ముంబై గెలుపు జెండా ఎగురవేసింది. ఇదిలా ఉంటే.. ఈ మ్యాచ్ సందర్భంగా అంపైర్‌తో రోహిత్ శర్మ వ్యవహరించిన తీరు వైరల్‌గా మారింది. కేకేఆర్ విధించిన 221 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రోహిత్ బ్యాటింగ్‌కు వస్తున్న సమయంలో.. అంపైర్ అతడి బ్యాట్‌ను పరీక్షించాడు. బ్యాట్ పరిమాణం సరిగ్గా ఉందా అన్న



విషయాన్ని తెలుసుకునేందుకు గేజ్ టెస్టు నిర్వహిస్తుండగా.. రోహిత్ తన బ్యాట్ సరిగ్గానే ఉందంటూ రియాక్షన్ ఇచ్చాడు. అయితే, నిబంధన ప్రకారం బ్యాట్‌ను టెస్టు చేసిన అంపైర్ సంతృప్తి వ్యక్తం చేయగా.. 'నేను ముందే చెప్పాను కదా!' అన్నట్లుగా రోహిత్ శర్మ నవ్వులు చిందిస్తూ మైదానంలోకి వెళ్లిపోయాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు హిట్‌మ్యాన్ అభిమానులను ఆకర్షిస్తున్నాయి. కాగా గతేడాది ఎక్కువగా ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన రోహిత్.. ఈసారి మాత్రం తుదిజట్టులో భాగంగా బరిలోకి దిగుతున్నాడు. దీంతో అతడి ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. ఇక టీమిండియాకు టీ20 ప్రపంచకప్-2024, ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025 టైటిల్ అందించిన ఘనత రోహిత్ శర్మది. కెప్టెన్ హోదాలో ముంబైని సైతం ఐదుసార్లు చాంపియన్‌గా నిలిపాడు.

స్పోర్ట్స్

## సీఎస్‌కే తుది జట్టు ఇదే.. రూ. 14 కోట్ల ఆటగాడికి ఛాన్స్?



ఐపీఎల్-2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తమ తొలి మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. గౌహతి వేదికగా రాజస్తాన్ రాయల్స్‌తో సీఎస్‌కే తలపడనుంది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు సీఎస్‌కేకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. లెజెండరీ వికెట్ కీపర్ బ్యాటర్ ఎంఎస్ ధోని, విధ్వసంకర బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్ గాయం కారణంగా సీఎస్‌కే ఆడే కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యారు. దీంతో జట్టు బాధ్యత మొత్తం సంజూ శాంసన్, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌పైనే పడింది. ఈ క్రమంలో రాజస్తాన్‌తో జరిగే తొలి మ్యాచ్‌లో సీఎస్‌కే ప్లేయింగ్ ఎలెవన్‌లో ఎలా ఉండబోతుందో ఓ లుక్కేద్దాం. ఈ మ్యాచ్‌లో యువ ఆటగాడు ప్రశాంత్ వీర్ అరంగేట్రం చేసే అవకాశముంది. గతేడాది డిసెంబర్‌లో జరిగిన మినీ వేలంలో ప్రశాంత్ వీర్‌ను రూ. 14.2 కోట్ల భారీ ధర వెచ్చించి మరి సీఎస్‌కే కొనుగోలు చేసింది. ఈ 20 ఏళ్ల లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ ఆల్‌రౌండర్‌ను రవీంద్ర జడేజాకు ప్రత్యామ్నాయంగా తీసుకున్నారు. ఈ ఏడాది సీజన్‌కు ముందు జడేజా సీఎస్‌కే నుంచి రాజస్తాన్‌కు ట్రేడ్ అయిన సంగతి తెలిసిందే. అదేవిధంగా ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ మథ్యూ షార్ట్, ఇంగ్లండ్ పేసర్ జేమీ ఓవర్టన్ సీఎస్‌కే తరపున ఐపీఎల్ అరంగేట్రం చేసే అవకాశముంది. అన్షుల్ కాంబోజ్, ఖలీల్ అహ్మద్ పేస్ బౌలింగ్ బాధ్యతలను పంచుకోనున్నారు. స్పిన్నర్లగా నూర్ అహ్మద్, రాహుల్ చాహర్ తుది జట్టులో చోటు దక్కించుకునే సూచనలు కన్పిస్తున్నాయి. సీఎస్‌కే బ్యాటింగ్‌ను సంజూ శాంసన్, రుతురాజ్ గైక్వాడ్ ప్రారంభించనున్నారు.

**సీఎస్‌కే తుది జట్టు(అంచనా)**

సంజు శాంసన్ (వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), ఆయుష్ మాత్రే, మాథ్యూ షార్ట్, శివమ్ దూబే, ప్రశాంత్ వీర్, జామీ ఓవర్టన్, అన్షుల్ కాంబోజ్, రాహుల్ చాహర్, నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్

రాజస్తాన్ తుది జట్టు(అంచనా): యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, రియాన్ పరాగ్ (కెప్టెన్), షిమ్రోన్ హెట్మెయర్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, దాసున్ షనక, జోఫ్రా ఆర్చర్, సందీప్ శర్మ, రవి బిష్ణోయ్, ఆడమ్ మిల్నే

# సౌత్ సినిమాలు చూడటాన్ని ఎంజాయ్ చేస్తా!



స్టార్ హీరోయిన్ రవీనా టండన్ కూతురు రాషా తడానీ అప్పుడే పెద్ద సెలబ్రిటీ అయిపోయింది. చేసింది ఒక్క సినిమా (ఆజాద్)నే అయినా ప్రేక్షకుల్లో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఇక ఆజాద్ మూవీలో ఉయి అమ్మా పాటలో డ్యాన్స్‌తో ఇరగదీసి సెన్సేషన్ అయింది. ఈ బ్యూటీ శ్రీనివాస మంగాపురం మూవీతో తెలుగులో ఎంట్రీ ఇవ్వనుంది. సూపర్‌స్టార్ కృష్ణ నటవారసత్వాన్ని కొనసాగిస్తూ ఘట్టమనేని జయకృష్ణ (రమేశ్‌బాబు తనయుడు) వెండితెరకు హీరోగా పరిచయం కాబోతున్నాడు. ఈ మూవీలో రాషా తడానీ హీరోయిన్‌గా నటిస్తోంది. తాజాగా ఆమె మాట్లాడుతూ.. నాకు దక్షిణాది సినిమాలు చూడటమంటే చాలా ఇష్టం. ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్, మహేశ్‌బాబు.. ఇలా అందరి సినిమాలు చూస్తుంటాను. వాళ్ల సినిమాలన్నీ కొత్త అనుభూతినిస్తాయి. ఇప్పుడదే ఇండస్ట్రీలో భాగం కావడం సంతోషంగా ఉంది. దీన్ని నేను ఎంజాయ్ చేస్తున్నాను.

హీరోయిన్స్ కూడా..

హీరోలే కాదు, అక్కడ హీరోయిన్స్ రష్మిక మందన్నా, శ్రీలీల.. ఇలా అందరూ స్ఫూర్తిదాయకంగా ఉంటారు. అలాంటి సినీ ప్రపంచంలో భాగమయ్యే అవకాశం లభించినందుకు గర్వంగా ఉంది. నా జర్నీ చక్కగా ముందుకు సాగుతుందనుకుంటున్నాను అని చెప్పుకొచ్చింది. శ్రీనివాస మంగాపురం విషయానికి వస్తే.. ఆర్ఎక్స్ 100, మంగళవారం ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ ఈ ఏడాదే విడుదల కానుంది. మరోవైపు రాషా.. లైకే లైకా అని ఓ హిందీ మూవీ కూడా చేస్తోంది.

# శరవణన్ ‘లీడర్’ రిలీజ్ డేట్ కన్ఫార్మ్




తమిళనాడుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త లెజెండ్ శరవణన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘లీడర్’ విడుదలకు సిద్ధమైంది. 50 ఏళ్ల వయసులో ‘లెజెండ్’ సినిమాతో వెండితెరకు పరిచయం అయిన ఆయన, ఆ చిత్రం తర్వాత కాస్త గ్యాప్ తీసుకుని ఇప్పుడు ఈ కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ట్రైలర్‌ను చూస్తుంటే ఇది ఒక భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తండ్రి-కూతురు మధ్య ఉండే సెంటిమెంట్ ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజాగా ఈ మూవీ విడుదల తేదీని కూడా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఆర్ఎస్ దురై సెంథిల్‌కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పాయల్ రాజ్‌పుత్ హీరోయిన్‌గా నటించగా, శ్యామ్, ఆండ్రియా, సంతోష్ ప్రతాప్, లాల్ ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. లెజెండ్ శరవణన్ తన స్వంత నిర్మాణ సంస్థ ‘ది లెజెండ్ న్యూ శరవణ స్టోర్స్’ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని భారీగా నిర్మించారు. ఈ సినిమాను తమిళ్ మరియు తెలుగు భాషల్లో ఏకకాలంలో విడుదల చేయనున్నారు.

# గోపీచంద్ మలినేని మాస్ కౌంటర్!




నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రాబోతున్న భారీ ప్రాజెక్ట్ ‘ఔఃఐ-111’. ‘వీరసింహారెడ్డి’ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ గ్యాంగ్‌స్టర్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఇప్పటికే లేడీ సూపర్ స్టార్ నయనతార మెయిన్ హీరోయిన్‌గా ఖరారైన సంగతి తెలిసిందే. తాజాగా, ఈ చిత్రంలో మరో యంగ్ బ్యూటీని ఎంపిక చేసుకున్నట్లు పలు పోస్టులు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. సెకండ్ పార్ట్ కోసం మరో హీరోయిన్ అవసరమని, ఆ పాత్ర కోసం డింపుల్ హయాతిని ఎంపిక చేసినట్లు టాక్. అయితే డింపుల్ హయాతి ఎంపికపై ఒక నెటిజన్ సీరియస్ అవుతూ .. “ఇంత హైప్ ఉన్న సినిమాను ఎలా చెడగొట్టాలో మేకర్స్‌ను చూసి నేర్చుకోవాలి. డింపుల్ బదులు రవీనా టాండన్‌ను తీసుకుంటే బాగుండేది, ఇదొక బ్లండర్ మిస్టేక్” అంటూ పోస్ట్ పెట్టాడు. దీనిపై దర్శకుడు గోపీచంద్ మలినేని చాలా కూల్‌గా, సెటైరికల్‌గా స్పందించారు. సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన ఒక ఫేమస్ మీమ్ వీడియోను షేర్ చేస్తూ.. “మీకేమన్నా చెప్పారా ఎవరైనా.. నేనెవరికీ చెప్పలేదండి!” అనే డైలాగ్‌తో కౌంటర్ ఇచ్చారు. ఈ పోస్ట్ ద్వారా డింపుల్ హయాతిని తీసుకున్నారనే వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. దీంతో ఆ రూమర్లకు చెక్ పడినట్లయింది. అయితే, అసలు ఆ రెండో హీరోయిన్ ఎవరు? అనే ఉత్కంఠ ఇప్పుడు నందమూరి అభిమానుల్లో నెలకొంది.

# హీరో వెంకట్ ‘హరుడు’ రిలీజ్ ఎప్పుడంటే?



శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి, అన్నయ్య, ప్రేమ కోసం, శివ రామరాజు తదితర సినిమాలతో అప్పట్లో సక్సెస్ అందుకున్న హీరో వెంకట్.. తర్వాత అడపాదడపా మూవీస్ చేస్తూనే ఉన్నాడు. గతేడాది రిలీజైన ‘ఓజీ’లోనూ పవన్ కల్యాణ్‌కి అన్నగా నటించాడు. ఇతడు హీరోగా చేసిన ‘హరుడు’ సినిమా విడుదలకు సిద్ధమైంది. రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాకు డాక్టర్.దిక్కల లక్ష??మణ్ రావు, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి నిర్మించారు. ఇప్పటికే టీజర్ రిలీజ్ చేశారు. తాజాగా మే 8న చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. హెబ్బా పటేల్ , సలోని , నటషా , అలీ తదితరులు కీలక పాత్రలు పోషించారు.




# రాంచరణ్ ఆర్‌సీ 17 క్రేజీ న్యూస్.. మరో మ్యూజిక్ డైరెక్టర్‌తో చర్చలు !

టాలీవుడ్‌లో సుకుమార్ -రాంచరణ్ కాంబినేషన్‌లో వచ్చిన రంగస్థలం బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిందని తెలిసిందే. ఈ క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17 సందడి చేయనుంది. మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కించనున్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు కూడా వచ్చాయి. అయితే తాజాగా మరో ఆసక్తికర అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రం కోసం మరో మ్యూజిక్ డైరెక్టర్ పేరును పరిశీలిస్తున్నట్టు ఓ అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతోంది. ఇంతకీ అతడెవరో తెలుసా..? ధురంధర్ మ్యూజిక్ డైరెక్టర్ శశ్వత్ సచ్‌దేవ్. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు. ఇదే నిజమైతే ఆర్‌సీ 17పై అంచనాలు మరింత పెరిగిపోవడం ఖాయమైనట్టే. మరి రాబోయే రోజుల్లో రాంచరణ్-సుకుమార్ టీం నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలి. రాంచరణ్ ప్రస్తుతం పెద్ది సినిమాలో నటిస్తున్నాడని తెలిసిందే.. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ డ్రామా గా వస్తోన్న ఈ చిత్రానికి ఉప్పెన ఫేం బుచ్చి బాబు సాన దర్శకత్వం వహిస్తున్నాడు. పాన్ ఇండియా రూరల్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రంలో కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. పెద్ది ఏప్రిల్ 30న 2026న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మూవీలో జగపతిబాబు, దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పెద్ది చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి.



# ఓటీటీలోకి ధురంధర్ బ్యూటీ ‘యుఫోరియా’..

## ఇంతకీ ప్లాట్‌ఫాం ఏంటో తెలుసా?

టాలీవుడ్ డైరెక్టర్ గుణశేఖర్ దర్శకత్వంతో తెరకెక్కిన చిత్రం యుఫోరియా సోషల్ డ్రామా నేపథ్యంలో హోం బ్యానర్ గుణ హ్యాండ్ మేడ్ ఫిలిమ్స్‌పై నీలిమ గుణ తెరకెక్కించిన ఈ మూవీలో పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ గౌతమ్ వాసు దేవ్ మీనన్ జయదేవ్ నాయర్ పాత్రలో నటించగా.. భూమికా చావ్లా కీలక పాత్ర పోషించింది. ధురంధర్ భామ సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి, లిఖిత యలమంచిలి, అడ్డాల పృథ్వీరాజ్, కల్ప లత ఇతర కీలక పాత్రల్లో నటించారు. 2026 ఫిబ్రవరి 6న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ కమర్షియల్ సక్సెస్ అందుకోలేకపోయినా.. ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకుంది. అయితే ఈ చిత్రానికిగాను ఉత్తమ సహాయ నటిగా భూమికా చావ్లా, ఉత్తమ కథా రచయితగా గుణశేఖర్ రెండు గద్దర్ అవార్డులను అందుకున్నారు. కాగా ఈ చిత్రం ఇక ఓటీటీలో తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అయింది. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం ఈటీవీ విన్‌లో ప్రీమియర్ కానుంది. యుఫోరియా ఏప్రిల్ 2 నుంచి స్ట్రీమింగ్ కానుంది. 8 వారాల థియాట్రికల్ విండో తర్వాత ఓటీటీలోకి రాబోతున్న ఈ సినిమా ఎలాంటి రెస్పాన్స్ రాబట్టుకుంటునేది ఆసక్తికరంగా మారింది.

Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463